# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

వెల : రూ. 10.00

జనవరి 2023



# శ్రీ సద్గురు స్థాపిత ఆశ్రమ స్వర్ణోత్సవాల దృశ్యములు



జ్యోతి ప్రజ్వలనము



శ్రీ రామలింగేశ్వరస్వామివారి అర్చన



యాగశాల ప్రవేశం



సత్సంగ సమావేశములు

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 42 సంచిక 5
పేజీలు 44
జనవరి 2023

5సం॥ల చందా రూ. 500

2సం॥ల చందా రూ. 240

సంవత్సర చందా రూ. 120

విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ – 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో ............................ ....... పేజీ**


దాశరథీ శతకము ............................ ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట.................................... ............ 7
శ్రీ దేవీ మహాత్మ్యం ..........................................9
జీవన గమ్యం ..................................................11
చెప్పుడు మాటలు విని చెడిపోకుమన్నది...... 13
అగస్త్య హృదయం ........................ ..............15
లక్ష్మీదేవి ..................... .......................................17
నూతన సంవత్సరానికి స్వాగతం............20
దృష్టి ............................ ................. ................. 21
రామానందావధూత ................................25
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు .....................27
వివేక చూడామణి ................. .................28
నిరీక్షణ ..............................................................30
కాళీబాబు సన్నిధిలో ఒక గంట .............32
యచ్ఛదత్తనుడు ........................ ...................34
శ్రీ బాబు దివ్య లీలలు........... ........ ........36
భక్తి ..........................................................................38
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... ............................ ...................41

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

30) చిక్కని పాలపై మిమిజెందిన మీగడ పంచదారతో
మెక్కిన భంగి మీ విమలమేచక రూపసుధారసంబు నా
మక్కువ పళ్ళెరంబున సమాహిత దాస్యమనేటి దోయిటన్
దక్కెనటంచు జుఱ్ఱెదను దాశరథీ! కరుణాపయోనిధీ!

భావం - చిక్కని పాలమీద నిగనిగలాడు మీగడతో చక్కెర కలిపికొని తిన్నట్లుగా నీ రూపమనియెడు అమృతము నా ప్రేమ పాత్రలో దగిన దాస్యమును దోసిలియందు లభించిందని చెప్పి జుఱ్ఱుకొంటాను దాశరథీ! కరుణాపయోనిధీ!




*అప్పుడే విధవరాలైన స్త్రీ ఏ మహాత్ముని ఆశీస్సుతో తిరిగి భర్తను పొందింది?
*పరమేశ్వరుని తన పుత్రునిగా భావించిన భక్తురాలెవరు?
*తాబేలు పిల్ల అవటం అంటే ఏమిటి?
*కుమారుడే తన తండ్రి కాళ్ళను ఎందుకు నరికాడు?
*మానవునికి భగవంతునికి అనుసంధానకర్త ఎవరు?
*దుర్యోధనునికి ద్వారకలో ఎందుకు మంచివాళ్ళు ఎవరూ కనిపించలేదు?
*అమాయక కాకి రౌడీ కాకిగా ఎలా మారింది?
*ఎవరికి ప్రపంచమంతా అసత్యంగా కనబడుతుంది?
*మానవుడు ఎప్పుడు భయరహిత స్థితిని చేరుకుంటాడు?
*హేమాంగి రెండవవైపుకు ఎందుకు తిరిగింది?

*సమాధానాలు లోపలి పేజీలలో ..........................*

# శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

14-7-1981

పురుషోత్తంగారు అనే భక్తుడు సమర్థ సద్గురు మాసపత్రికలో ఒక వ్యాసం చదివి ఆ వ్యాసంలో శ్రీ బాబూజీ ప్రస్తావించిన విషయాన్ని తనకు వర్తింప చేసుకున్నారు.

శ్రీ బాబూజీ ఉపన్యాసంలో భక్తులనుద్దేశించి, "తాబేలు సంకల్ప మాత్రంచేత తన పిల్లలకు ఆహారాన్ని అందజేయు గల్గుతుంది. మరి సర్వవ్యాపకుడు, సర్వశక్తిమంతుడు అయిన గురుదేవుడు తన శిష్యులకు లోటు చేస్తాడా?" అన్నారు.



పురుషోత్తంగారు ఈ విషయాన్ని చదివి, 'ఇది చాలా బాగుంది. మనము రోజూ శ్రీ బాబూజీ దర్శనార్థం వెళ్లనవసరం లేదు. ఆయన కృపారసం మనం ఇక్కడ ఉన్నా వర్షిస్తుంది. ఇప్పుడు నాకు చాలా తృప్తిగా ఉంది' అన్నారు.

ఈరోజు రాత్రి శ్రీ బాబూజీ 9గం॥ భక్తులకు దర్శనం యిచ్చారు. శ్రీ పురుషోత్తంగారిని చూసి, "ఏమిటి విశేషాలు?" అని అడిగారు.

పురుషోత్తంగారు మాట్లాడుతూ, 'మన సమర్థ సద్గురు మాసపత్రికలో మీ ఉపన్యాసము ప్రచురించారు. చాలా బాగుంది' అన్నారు.

శ్రీ బాబూజీ మాట్లాడుతూ, "తాబేలు అంటే కేవలం ఒక జలచరం అనుకోకండి. సాక్షాత్తు శ్రీమన్నారాయణమూర్తి కూర్మావతారము అన్నమాట. తాబేలు తన పిల్లలకి సంకల్ప మాత్రంచేత ఆహారము అందజేస్తుంది. అందులో సందేహము లేదు.

భగవానుడు తన పిల్లలకు లోటు రానిస్తాడా? కాని ఆ ఆహారాన్ని అందుకోగలిగిన శక్తి తాబేలు పిల్లకే ఉంటుంది గాని అది ఇంకేదైనా అయితే ఉండదు.

అంటే భగవానుడు తన పిల్లలకి ఏదైనా అందించటానికి సిద్ధంగానే ఉన్నాడు. అది అందుకోగలిగిన అర్హత మనము కలిగి వుండాలి కదా! అట్టి అర్హత భక్తులకే ఉంటుంది. మరి అంతటి భక్తుడైతేనే ఆ విశ్వాసము నిలుస్తుంది. ఆ శక్తిని పొందగలుగుతాడు. కాని భక్తునివలె నటించేవాడు పొందజాలడు. విజయవాడ రేడియోస్టేషన్ మీద పాయింట్ నిలిస్తే శ్రవణానందకరంగా పాట వినపడుతుంది గాని లేకపోతే ఏముంది, బర్ బర్‌మనే శబ్దం మిగులుతుంది' అన్నారు శ్రీ బాబు.

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

*** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

**జనవరి 2023**

2 సోమ - ముక్కోటి ఏకాదశి - శ్రీ సద్గురు పాదపూజ

6 శుక్ర - పుష్య పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ

14 శని - భోగి పండుగ, ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం - శ్రీ సద్గురు పాదపూజ

15 ఆది - సంక్రాంతి పండుగ - శ్రీ సద్గురు పాదపూజ

17 మంగళ - శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

**ఫిబ్రవరి 2023**

**1 బుధవారం నుండి 5 ఆదివారం వరకు వార్షిక సత్సంగములు**

1 బుధ - భీష్మ ఏకాదశి, భక్త సహిత శ్రీసద్గురు మంగళమూర్తి ప్రతిష్ట 19వ వార్షికోత్సవం - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

5 ఆది - మాఘ (గురు) పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

15 బుధ - శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

18 శని - మహాశివరాత్రి - శ్రీ సద్గురు పాదపూజ

# అమ్మ మాట

## భక్తి హృదయం

- రమణ ప్రసాద్

ఎవరి హృదయంలో భక్తి నిండి ఉంటుందో దానిని వర్ణించటానికి కవులు కూడా చాలరు. శ్రీబాబూజీ భక్త హృదయాన్ని "సాగరమా! అది భక్త హృదయమా! తరమౌనె తెలియగ హరి హరాదులకైన" అన్నారు. **భక్తానాం హృదయాంబోజే విశేషేన ప్రకాశతే** అటువంటి భక్తులతో విచారణ చేస్తే నవనీతం వస్తుంది.



రాధమ్మ తల్లి అందరూ తరించాలని, అందరూ కృష్ణ తత్త్వంలో ఓలలాడాలని ఆవేదన పడుతుంది.

**ఎంత పిలచిన రావేల పంతమేల**
**అందుచేతనె నిన్ను నమ్మరయ్య జనులు**
**జాలమింకేల నా మది సంతసిల్ల**
**పరుగు పరుగున రావోయి బాల కృష్ణా !**

ధ్యానం చేసే సమయంలో స్వామి పాదపద్మాలు హృదయ గుహలో పెట్టుకుని కూర్చుంటే మనస్సు అంతర్ముఖమై ఆనందం వెల్లి విరుస్తుంది.

స్వామి ముఖకమలం నుంచి వచ్చిన పదములు మననం చేస్తే గురుపదము లభిస్తుంది. నీలాద్రి శిఖరాన నెలకొని ఉన్న నీలమేఘ శ్యాముని మనోవీథిలో దర్శించగలం. ఆయన నగుమోము అందం ముందు ఏ అందమైన వెగటు పుడుతుంది. నువ్వు అంతర్ముఖుడవై నీలోకి వెళ్తే ప్రపంచంలోని విషయాలు రుచించవు.

ధనుర్దాసు అనే మల్లయోధుడు హేమాంగి అనే ఆమె ఎక్కడకు వెళ్తే అక్కడ గొడుగు పట్టేవాడు. శ్రీ రామానుజుల వారి దృష్టి ఆయనపై పడింది. తన శిష్యులతో అతనిని పిలిపించి "ఆమెలో నిన్ను ఏది ఆకర్షించింది?" అని అడిగితే "ఆమె కళ్ళు" అని చెబుతాడు. "అంతకంటె అందమైన కళ్ళు చూపిస్తాను. ఆయనను ప్రేమిస్తావా?" అని అడుగుతాడు. ధనుర్దాసు 'సరే'నంటాడు. అతనికి రంగనాథస్వామి దర్శనం చేయిస్తే ఆ స్వామి కనుల అందాలకు ముగ్ధుడవుతాడు. అతడు, అతని భార్య

హేమాంగి శ్రీరామానుజుల శిష్యులవుతారు. ఇది కొంతమంది శిష్యులకు ఈర్ష్య కలిగించింది. అది తొలగించటానికి ఆ దంపతులలో కలిగిన భక్తి పరిణతిని చాటడానికా అన్నట్లుగా శ్రీ రామానుజులవారు ఒక పథకం పన్నుతారు.

ధనుర్దాసు రామానుజులవారి వద్ద ఉన్న సమయంలో తన శిష్యులను పిలిచి హేమాంగి నగలను దొంగిలించుకొని రమ్మంటాడు. వారు వెళ్ళిన సమయంలో ఆమె ఒక ప్రక్కకు తిరిగి పడుకొని ఉంటుంది. శిష్యులు ఆ ప్రక్కవైపు నగలు తీసేసరికి ఆమె రెండవ వైపు తిరుగుతుంది. ఆమె మేల్కొన్నదని భయపడి శిష్యులు పారిపోతారు. నిజానికి ఆమె వారు తన నగలు పూర్తిగా తీసికోవాలనే ఉద్దేశ్యంతో అటువైపుకు తిరిగింది. ఈ విషయం గ్రహించిన శిష్యులు వారికి ఐహిక సంపదలపై కలిగిన విముఖతకు ఆశ్చర్యపడతారు. నీ పాదసేవ విడబోయకన్నా!- ఇది మనస్సులో ముద్ర వేసుకోవాలి.

శ్రీ గురుదేవులు అట్టి శక్తిని భక్తిని ఆత్మ జ్ఞానాన్ని ప్రసాదించెదరు గాక సుఖీభవ!

## చందాదారులకు విన్నపము

ప్రియమైన పాఠకులకు, చందాదారులకు తెలుపునది ఏమనగా, కొద్ది సంవత్సరాలుగా కాగితము, ముద్రణ ఖర్చులు విపరీతముగా పెరిగినవి. ఇరవై సంవత్సరాల నుండి మన ఆధ్యాత్మిక మాసపత్రిక సమర్థసద్గురును ప్రతికి 5 రూ. చొప్పున పంపిణీ చేయుచున్నాము. ఇంకనూ అదే వెలను కొనసాగించుట అసాధ్యముగా వున్నది. కావున జనవరి 2023 నుండి ఈ క్రింద తెలిపిన విధంగా మాసపత్రిక వెలను పెంచుటకు నిర్ణయింపబడినది. తమ సహాయ సహకారములను ఎప్పటి వలెనే కొనసాగించి, మన మాసపత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినదిగా అందరినీ కోరుచున్నాము.

**విడి ప్రతి 10రూ, సంవత్సర చందా 120రూ, 5 సంవత్సరాలకు 500రూ, జీవిత చందా (15 సం॥లకు) 1250రూ.**

# దేవీ మహాత్మ్యం

-కీ.శే. శ్రీ రామతారక పరబ్రహ్మ శాస్త్రి

శ్రీ దేవి అనగానే ఒక స్త్రీ రూప దేవత అనే భావం సహజంగా కలుగుతుంది. అందుకు ముఖ్య కారణం 'దేవీ' శబ్దము స్త్రీ లింగ వాచకముగా వాడుకలో వుండటమే. స్త్రీ రూపంలో వుండే దేవతలందరికీ 'శ్రీదేవి' అనే పదం అన్వయించబడటం కూడా అందుకు కారణమే. కానీ, వాస్తవం విచారించి తెలుసుకుంటే, శ్రీదేవి స్త్రీ కాదని, లేదా స్త్రీ మాత్రమే కాదని బోధపడుతుంది.

శ్రీ అంటే మనం మామూలుగా అనుకునే 'లక్ష్మి' ఐశ్వర్యం, సంపద మాత్రమే కాకుండా, సరస్వతి, కీర్తి, కాంతి, వృద్ధి, అధికారము మొదలైన అనేక అర్థాలతోపాటు త్రివర్గము, వేదత్రయము, అవిద్య, బ్రహ్మవిద్య, మోక్ష సామ్రాజ్య లక్ష్మి అనే అర్థాలు కూడా వున్నాయి. వీటిలో ఎవరి భావాలకు, పాత్రతలకు తగిన అర్థాన్ని వారు గ్రహిస్తారు.

'దేవి' శబ్దము 'దేవ' శబ్దానికి స్త్రీలింగ రూపము. దేవ శబ్దానికి కూడా సాధారణంగా మనం అనుకునే శివుడు, విష్ణువు వంటి లేదా ఇంద్రాదుల వంటి దేవతలనే కాక, ఇంద్రియము, ఆత్మ, పరమాత్మ అనే అర్థాలు వున్నాయి. దేవ శబ్దానికి వ్యుత్పత్తి అర్థం ప్రకాశముగలవాడు అని. దేవి అంటే ప్రకాశము కలది అని అర్థము. పైన తెలిపిన అర్థాలను బట్టి శ్రీదేవి అంటే బ్రహ్మవిద్యా రూపమైన ప్రకాశం కలది.

బ్రహ్మవిద్యా రూపమైన పరమాత్మ, మోక్షస్వరూపమైన పరమాత్మ అని అర్థం చేసుకోవచ్చు. బ్రహ్మవిద్య, మోక్షము, పరమాత్మ అనే పదములకు సంస్కృత భాషలోగల లింగభేదాన్ని బట్టి అసలు వస్తువుకు లింగాన్ని ఆపాదించడం యోగ్యం కాదు. లింగభేదం బాహ్యస్వరూపమైన దేహానికేగాని, దానికి అతీతమైన ప్రాణానికిగానీ, జీవునికిగానీ నిజంగా లేదు. దేహంతో తాదాత్మ్యం పొందిన జీవుడు తన శరీరం యొక్క రూపాన్ని దానికి ఆపాదించుకోవడం అజ్ఞానంచేతనే గానీ, వేరుకాదు. పురుష వేషం వేసిన స్త్రీని చూసి, ఇతరులు పురుషుడే అనుకున్నప్పటికీ తాను పురుషుడనని ఆమె అనుకుంటుందా? అట్లాగే స్త్రీ వేషం వేసిన పురుషుని చూసి అందరూ స్త్రీయే అనుకున్నా అతను మాత్రం తాను స్త్రీ

అనుకోడు కదా! ఒకవేళ ఎవరైనా అట్లా అనుకున్నా అది అజ్ఞానమే అవుతుందిగానీ, సత్యం కాదు కదా! అందుచేత ఈ లింగభేదం వ్యవహారం కోసం అజ్ఞానం వలన ఆపాదించబడినదే. వాస్తవంగా జీవుడికే లేనప్పుడు కేవల జ్ఞానస్వరూపం, మోక్షస్వరూపం అయిన పరమాత్మకు ఎట్లా వుంటుంది? కాబట్టి శ్రీదేవి అంటే ఒక స్త్రీదేవత అనే బాహ్యరూప సంబంధమైన భావన దాటి, పరమాత్మ అనే భావం మనస్సులో దృఢంగా నిలుపుకోవాలి. కానీ, మానవులకు లేదా జీవులకు దేహతాదాత్మ్యం, దేహభ్రాంతి వున్నంత వరకు నిరాకార నిర్గుణ పరమాత్మకు తప్ప సాకార సగుణ స్వరూపంలో భావించినప్పుడు పరమాత్మకైనా సరే, లింగభేదాన్ని ఆపాదించకుండా వుండటం సులభం కాని మాట వాస్తవమే.

కానీ, బాహ్య రూపాన్ని చూస్తున్నప్పటికీ, అది వాస్తవమనే భ్రాంతిని పొందక, సత్యమైన పరమాత్మ భావనను దృఢంగా నిలుపుకోవటమే జ్ఞానము. అట్టి జ్ఞానం తనను గూర్చి కూడా కలిగి, స్థిరంగా నిలిస్తే సుఖదుఃఖాతీతమై, జననమరణ రహితమైన, శాశ్వతానందరూపమైన మోక్షం సిద్ధిస్తుంది. అంతవరకు అజ్ఞానావరణం పూర్తిగా నశించదు కాబట్టి సాధన సాగుతూనే వుండాలి.

ఇక మహాత్మ్యం అంటే ఏమిటో విచారిద్దాం. మామూలుగా మన దేహేంద్రియాలకు, మనస్సుకు అందకుండా వుండే ఏ విషయాన్నైనా, ఏ శక్తినైనా మనం చూస్తే దాన్ని మహిమ అంటాము. ఇది వ్యక్తి యొక్క మానసిక శక్తిని, భావనా బలాన్ని బట్టి నిశ్చయింపబడుతుంది. ఒకడికి మహిమగా తోచినది, మరొకడికి మహిమగా అనిపించదు. సామాన్య విషయంగా వుంటుంది. వాస్తవానికి మనస్సు, ఊహ వీటికి అందేది ఏదీ మహిమకాదు. దాన్ని కనికట్టు లేదా గారడి అనవచ్చు. అందులో అనేక రకాలు, స్థాయిలు వుంటాయి. అవన్నీ అజ్ఞానానికి సంబంధించినవే.

- సశేషం

# జీవన గమ్యం

- మైలవరపు జానకిరామ శాస్త్రి

మానవుని పరమ గమ్యము "యీ జీవితంలోనే పరిపూర్ణత్వాన్ని పొందుట, లేక అత్మ సాక్షాత్కారమును పొందుట." ఎవరైతే "అంతరాత్మ పిలుపు" వినగలుగుతారో వారే గమ్యాన్ని చేరుతారు.

మనకు బాహ్యంగా వున్న వస్తువులనుండి, విషయాల నుండి నిస్సందేహంగా కొంత సంతోషాన్ని, సుఖాన్ని పొందవచ్చు. కానీ, మనకు కావలసినది తాత్కాలిక సుఖం కాదు. మనకి కావలిసినది శాశ్వత సుఖం. శ్రీ శంకర భగవత్పాదాచార్యుల వారు వివేక చూడామణిలో మూడు వస్తువులు జీవితములో లభించుట అరుదని సెలవిచ్చారు.

అవి - "మానవ జన్మ లభించుట, మోక్షము పొందవలెననెడి ఆకాంక్ష, మహా పురుషుల ఆశ్రయము. ఈ మూడును దొరకుట దుర్లభము. ఇవి దైవానుగ్రహము వలన మాత్రమే కలుగుతాయి" అని. మనకు అరుదైన మానవ జన్మ లభించింది, మనకు మోక్షము పొందవలెనని కోరిక కలిగినది; గురువు అనుగ్రహం కూడా లభించింది. ఇవన్నీ వున్నా, వీటి అన్నిటినుంచి పొందవలసిన లబ్ధిని పొందుటకు కావలసిన ఆతృత, పరితాపము, మనలో లోపిస్తోంది.

ప్రసిద్ధి చెందిన ఆంగ్ల గేయరచయిత విలియమ్ వర్డ్స్వర్త్ అంటాడు -"మన జన్మ- ఒక నిద్ర, మరపు మాత్రమే" అని. ఈ నిజాన్ని బ్రహ్మజ్ఞాని మాత్రమే తెలుసుకోగలుగుతాడు. అతనికి యీ చర్మ చక్షువులకు గోచరించేదంతా అసత్యంగానే అగుపడుతుంది.

"'నిద్ర' అంటే, మన దివ్యాత్మయెక్క స్పృహలేకుండా మనకు చేసేది, 'మరపు' అంటే మన నిజ, దివ్యతత్వాన్ని మరిపింప చేసేది" అని అర్థం. మనలోని ఆవరణ, విక్షేప దోషాలు మనని నిజతత్వాన్ని తెలుసుకోకుండా దూరం చేస్తాయి. 'ఆవరణ' అంటే నిజ తత్వాన్ని ఒక తెరవలె ఆవరించి, మరుగు పరుస్తుంది. 'విక్షేపము' అని అంటే నిజంగా ఉన్నదానిని వేరొక విధంగా వక్రీకరించి చూపిస్తుంది.

మనం ఎటువంటి అసత్యమైన బంధాలకు అంటిపెట్టుకొనకుండా వుండాలి. మనం నిజాయితిగా వుండాలి. మనలో సద్భావాలు ఏర్పరుచుకోవాలి. సద్గుణాలను పెంచుకోవాలి.

వాల్మీకి తన తల్లి, భార్యను పోషించుటకు బందిపోటు దొంగగా మారాడు. నారదుడు కనిపించి "నువ్వు పొందే పాపంలో భాగం పంచుకొనుటకు నీ భార్య, తల్లి, తండ్రి సిద్ధంగా వున్నారేమో కనుక్కొనిరా"

అన్నాడు. అతను యింటికి వెళ్ళి సభ్యులందరితో, "నేను హత్యలు, దోపిడీలు చేసి మిమ్ములను పోషిస్తున్నాను. యీ పనులచే వచ్చే పాపాలలో మీరు భాగం పంచుకుంటారా?" అని ప్రశ్నించాడు. "నువ్వు ఇవన్నీ నీ భార్యా బిడ్డలను పోషించటానికి చేస్తున్నావు. నీ పాపాలలో భాగం పంచుకునే అవసరం మాకు లేద"న్నారు. అతను వచ్చి నారదుని కట్లు విప్పి, దీనంగా మీరు నా కళ్ళు తెరిపించారు. మీ పాదాలే నాకు శరణ్యం" అంటాడు. ఆ విధంగా నారదుడు అతనికి తారక మంత్రోపదేశం చేస్తాడు. ఆ మంత్రాన్ని తీవ్రంగా జపిస్తాడు. అతని శరీరం మీద పుట్టలు (వల్మీకం) కట్టాయి. "వాల్మీకి మహర్షి"గా పిలువబడ్డాడు. ఆది కావ్యమైన రామాయాణ కావ్యాన్ని రచించి "ఆది కవి"గా ప్రసిద్ధిగాంచాడు.

ఈ శరీరము, మనస్సు, ఇంద్రియములు, 'తాను' కాదని, 'తాను' ఆత్మ స్వరూపమని గ్రహించాలి. దానికి కావాల్సింది నిజాయతీ, దృఢమైన దీక్ష ఇతర ఆలోచనలకు తావు రానీయకుండా మనస్సును భగవంతునికే అర్పించాలి. అంటే సర్వసమర్పణ చేయాలి. అలా మన మనస్సును భగవన్ముఖం గావించి, వేరే పనులు చేస్తున్నా నిరంతరము దైవ స్మరణములోనే వుండాలి. మన జీవితమంతా దివ్యమయం చేసుకోవాలి. మన జీవితం నిరంతర, అవిరామ ధ్యానమయం కావాలి. మనం చేసే ప్రతి పని దేవుని అర్చనగా భావించి చేయలి.

"ప్రాపంచిక జీవితములోనున్న వారికిది సాధ్యమవుతుందా?" అని మనము అనుకోవచ్చును. తప్పక సాధ్యమవుతుంది. మన దైనందిన సంబంధ బాంధవ్యములను పైన చెప్పిన విధముగా ఆధ్యాత్మీకరణ గావించుకొని, జీవితాన్ని అఖండ నిరామయ, అవిశ్రాంత ధ్యాన మయంగా చేసికోవాలి.

"మొదట దేహమును నియంత్రించుకొనుము. పిమ్మట నీ ఆలోచనలను, ప్రార్థన, జపము, కీర్తన, విచారణ, ధ్యానముల ద్వారా వినిర్మలమొనర్చుము" అన్నారు స్వామి వివేకానంద.

ఈ విధంగా సాధన చేస్తే మనస్సు ప్రశాంతత చెందుతుంది. మనస్సు నిర్మలమైనప్పుడు మనం అంతరాత్మ పిలుపును వినగలుగుతాం. గమ్యం చేరే మార్గం సుగమమై మన గమ్యస్థానమైన ఆత్మ సాక్షాత్కారాన్ని పొందుతాము.

# చెప్పుడు మాటలు విని చెడిపోకుమన్నది

- హనుమత్ జయప్రద

ఒక పెంకుటింటి అరుగు పై కూర్చుని తీపి బూందీ తింటున్నాడో పిల్లాడు. పొట్లంలో ఉన్నవి తినేసి ఖాళీ పొట్లం ఉండచుట్టి విసిరేశాడు. ఒక కాకి రివ్వున వచ్చి ఆ కాగితపు ఉండను ముక్కున కరుచుకుని వెళ్ళి ఒక గోడపై వాలింది. కాళ్ళతో పొట్లాన్ని నొక్కిపట్టి ముక్కుతో విప్పింది. ఆశగా చూసింది. రెండు మిఠాయి పలుకులు మిగిలి ఉన్నాయి. ఆనందంతో తింటున్న కాకి కళ్ళు పెద్దవయ్యాయి.

అదే కాగితంలో బూరె తింటున్న కాకి చిత్రం ఒకటి చక్కగా గీసి ఉంది. కాకి ఆశగా బొమ్మకాకి నోట్లో బూరెను లాగింది. అది రాలేదు. మరోసారి ప్రయత్నించింది అమాయకంగా. దాని వాడి ముక్కు తగిలి కాకి చిత్రం కన్ను దగ్గర చిరిగింది. ఇది నిజమైన బూరె కాదని తెలుసుకున్న కాకి నిరాశగా పొట్లం వదిలి ఎగిరిపోయింది.

ఇదంతా ఆ గోడ పక్కన చెట్టు మీదున్న ఓ కాకి చూసింది. కాకి తెలివితక్కువతనానికి నవ్వుకుంది. ఇంతలో వచ్చి వాలిన మరో కాకి ఆ నవ్వుకి కారణం అడిగింది కుతూహలంగా. మొదటి కాకి వెర్రి బాగులతనాన్ని వర్ణించింది రెండో కాకి. ఉత్తుత్తి బూరె కోసం కాకి పొట్లు తలుచుకుని మళ్ళీ నవ్వింది.

మూడో కాకి ఈ విషయం ఇంకో కాకికి చెప్పింది. 'అయినా కాకి నోట్లో బూరెను లాక్కోవడం తప్పు కదా' అంటూ ముగించింది. తన వర్ణనలో 'ఇది నిజం కాకి కాదు కాగితంలో కాకి చిత్రం' అనే ముక్క చేర్చలేదు. ఈ కాకి తన గూటికి చేరినప్పుడు తోటి కాకులతో ఈ సంఘటనను పంచుకుంది. 'తోటి కాకి నోట్లో బూరె ముక్క కోసం దాని కళ్ళు పొడిచిందట కూడానూ' అంటూ మరో మాట చేర్చింది.

ఈ కాకులు ఎగిరి పక్క చెట్లకు వెళ్ళినప్పుడు కనబడిన కాకులతో ఈ విషయమే చెప్పుకున్నాయి. వాటిలో ఓ కాకి అయితే 'కాకి కన్ను పొడిస్తే, పాపం! రక్తం కారిందట కూడానూ' అంటూ అత్యుత్సాహం ప్రదర్శించింది. మరో కాకి ఇంకా కొంచెం ముందుకెళ్ళి 'ఆ గోడపై రక్తపు చారికలు చూశాను' అంటూ వాపోయింది. మరో కాకి 'నేను

ఆపడానికి ప్రయత్నిస్తే నన్ను కూడా గాయపరచబోయింది' అంటూ చెప్పుకుని సానుభూతి పొందింది. అలా అలా మాట మారుతూ కాకులన్నీ కలిసి మొదటి కాకిని రౌడి కాకిగా ముద్రవేశాయి. దానికి దూరంగా వుండాలని తీర్మానించాయి.

ఇవేమీ ఎరుగని మొదటి కాకి సాయంత్రం తన గూటికి చేరుకుని తోటి కాకులును స్నేహంగా చూసింది.

అప్పటిదాకా గుసగుసలాడుతున్న కాకులు చప్పున మాటలు ఆపి ముభావంగా తలలు తిప్పుకున్నాయి. కాకికి ఏమి అర్థంకాలేదు. రెండురోజులుగా అన్ని కాకులు వెలివేసినట్టుగా దూరంగా మసులుతున్నాయి. తన తప్పు ఏమిటో తెలియక అది తల్లడిల్లింది.

'ఒక్కోసారి అంతే! మన ప్రమేయం ఏమి లేకుండానే మనని సమాజం చెడ్డ వాళ్ళని చేసేస్తుంది. నీలాపనిందలు, పుకార్లమయం ఈ లోకం. మన మనసు మన తప్పు లేదని నిజాయితీగా జవాబు ఇస్తే బాధ పడక్కర్లేదు. సంతోషంగా కాలం గడపగలిగే మిత్రుడిని ఒక్కరిని ఎంచుకో చాలు. అలాంటి వందలమంది నీకేలా?' అంటూ ఓదార్చింది కొమ్మమీద కోయిలమ్మ!

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***జనవరి 2023 :*** AS 5423, 6624, 6900, 7217, 7420, 7639, 7647, 8497, 8512, 8517, 8600, 8601, 8617, 8940 - 8945, 8947, 8949-8955
LM - 4363, 4365

***ఫిబ్రవరి 2023 :*** AS 6535, 7674, 7675, 7676, 8629, 8630, 8962, 8963, 8967
LM 4366, 4367, 4370, 4373, 4374, 4375, 4377

# అగస్త్య హృదయం

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**ఏనమాపత్సు కృచ్ఛేషు కాంతారేషు భయేషుచ ।**
**కీర్తయన్ పురుషః కశ్చిత్ నావసీదతి రాఘవ ।**

**తాత్పర్యము** - రాఘవా! ఆపదలయందు, కష్టముల యందు, దుర్గమమైన మార్గములో మరియు భయమునందు, ఈ స్వామిని కీర్తించిన వారికి ఎన్నటికీ నాశనముండదు.

ఈ శ్లోకంలో అగస్త్యులు ఆపదలో, కష్టసమయంలో, ఆదిత్యుడు ఎలా ఆదుకుంటాడో పునరుద్ఘాటిస్తూ గుహ్యంగా గురుదేవులు ఇహపరములు రెండిటిలో సాధకులను ఎలా తరింపజేయగలరో వివరిస్తున్నారు.

గురుదేవులు నిన్ను సదా రక్షిస్తుంటారన్న అభయముతోపాటుగా 'నిన్ను తరింపజేసి తీరుతాను' అన్న వాగ్దానము ఈ శ్లోకంలో ప్రతిధ్వనిస్తోంది. సమర్థులైన సద్గురువులకు మాత్రమే అది సాధ్యం. శ్రీబాబూజీ మహరాజ్‌వారు నేనుండగా భయమేలా? (Why fear, I am here) అన్న అభయమును ప్రసాదిస్తూనే, 'నేను కామవరపుకోట జీడిని, ఎన్ని జన్మలకైనా మిమ్మల్ని తరింపజేసి తీరుతాను' అని హామీ ఇచ్చేవారు. అంతేకాక, 'ఆడిన మాట తప్పని ఇక్ష్వాకువంశం మాది' అని గుర్తుచేసే వారు. ఆ సూచనను గుర్తించి ఆయనను వటపత్రశాయియైన నారాయణుని అవతారముగా దర్శించగలిగిన వారికి అది ఒక మధురమైన అనుభూతి. **కశ్చిత్ పురుషః న అవసీదతి** అంటూ ఈయనను అనుసరించిన ప్రతిసాధకుడు తరిస్తాడు అన్నది అగస్త్యులు ప్రస్తావించిన హామీయే. అటువంటి **కశ్చిత్ పురుషః** అన్న సాధకుడు **కశ్చిత్ ధీరః** అని చెప్పబడినట్లు ఎంతో ధైర్యము, పట్టుదలతో సత్యవస్తువును తెలుసుకోవాలని శ్రీ బాబూజీవారి ఆశీర్వాదము. అందుకే 'మీరు యదుసింహుడి బిడ్డలు' అంటూ మనందరినీ ప్రేరేపిస్తూ సాధనలో ముందుకు నడిపిస్తున్నారు.

**అపత్సు** ఆపదలు, **కృచ్ఛేషు** కష్టములు, **కాంతారేషు** దుర్గమములైన దారులు, **భయేషు** భయములలో అన్న ప్రస్తావన సాధకుని జీవన గమనంలో వచ్చే బాహ్యాపరమైన అడ్డంకులను సూచిస్తోంది. గురుదేవుని పట్ల ప్రగాఢమైన విశ్వాసము వున్నవారికి ఈ అడ్డంకులు వాటంతటవే

అవే తొలగిపోతాయి. ఇటువంటి అనుభవాలు బాబూజీని శరణు పొందినవారికి అనేకములు. ఈనాటికీ నిత్య సత్యములు. అనన్య చింతనతో తనను స్మరించినవారికి గీతాచార్యులు ప్రసాదించిన యోగక్షేమముల అభయము కూడా అదే కదా!

కొంత లోతుగా పరిశీలిస్తే అసలైన సాధకుడు తన సాధనామార్గములో వచ్చే అడ్డంకులనే ఆపదలుగా కష్టములుగా భావించి వాటిని గురుదేవులకు విన్నవించుకుంటాడు. శ్రీబాబూజీ మహరాజ్ 'నీకు ధ్యానములో కలిగే అవరోధములను నీ హృదయబాబుకి విన్నవించుకో. వెనువెంటనే తొలగిపోతాయి' అని అభయమిచ్చేవారు. అది కామ క్రోధాది అరిషడ్వర్గాలకు సంబంధించిన విషయమైనా లేక ధ్యానములో మనసు నిలువనీయని మరే అంశమైనా గురుదేవునికి విన్నవించుకోవడమే సాధకుని కర్తవ్యము.

**కాంతారేషు** అన్న ప్రస్తావన అటువంటి దుర్గమమైన సాధనా మార్గంలో దారిచూపే **పథీనాం పతి** అయిన గురుదేవులనే సూచిస్తోంది. అంతేకాక, అవిద్యారణ్యములో అనేకములైన క్రూర జంతువులు వుంటాయని, ధ్యానాగ్ని అనే ఒక చిన్న నిప్పు కణికతో క్రూర జంతువులతో సహా ఆ అరణ్యము దహింపబడుతుందని శ్రీబాబూజీ మహరాజ్‌వారు బోధించారు.

అటు పిమ్మట సాధకుడు భయహేతువులైన అడ్డంకులను తొలగించటుకుంటూ చివరికి భయరహితమైన స్థితికి చేరుకుంటాడు. అంతటా తన గురుదేవులనే దర్శించగలుగుతూ సర్వమూ తానే అయినిండిన ఆత్మవస్తువు ప్రకాశమనీ, మరొకటి అయిన వస్తువు లేదనీ గుర్తించిన తరువాత భయానికి తావెక్కడిది? ఈ విధంగా అగస్త్యులు ఈ శ్లోకం ద్వారా పైకి శ్రీరాముని నిర్భయుడవు కమ్మని శలవిస్తూనే గుహ్యముగా గురుదేవులు సాధనా మార్గంలో సాధకుని నడిపించే క్రమమును తెలియజేస్తున్నారు. మనం శ్రీబాబుని ఎంతో ప్రీతిగా స్తుతించే **ఓం కష్ట దూరగాయ నమః, ఓం సంసార భయ నాశనాయ నమః, ఓం భయాపహాయ నమః** అన్న నామముల వెనుక పరమార్థము అటువంటి సాధనా పరిణతిని మనమందరమూ పొందాలన్న శ్రీ గురుదేవుల ఆకాంక్షయే!

# లక్ష్మీదేవి

- పాలూరి కాళీప్రసాద్

**తత్ క్షాంతి సంవర్ధినీం** - స్వామిలో ఓర్పును వృద్ధి పొందించేది అమ్మ. ఇప్పుడైతే రోజులు మారిపోయాయి కానీ తరతరాలుగా, మన చిన్నప్పుడు కూడా అందరికీ నాన్న అంటే హడల్. ఒక తప్పు చేసినా, లేదా నాన్నను ఏదైనా అడగలన్నా అమ్మ కొంగు చాటున నిలుచోటమే తెలుసు. నాన్న కోపాన్ని చల్లబరిచి ఆయనలో ఓర్పును కలిగించి మనకు అనుకూలంగా మార్చేది అమ్మే కదా! అసలు **'స్త్రీ బుద్ధిః ప్రళయాంతకః'** అని ఆడవాళ్ళ మాట వింటే ప్రళయాలు సృష్టిస్తారని తప్పుగా అర్థం చెబుతారు కానీ అక్కడ **'ప్రళయ కారకః'** అనలేదు కదా, **'ప్రళయాంతకః'** అన్నారు కదా అని నాకు అనిపిస్తూ ఉంటుంది. భర్తో, కొడుకో అప్పో తప్పో చేస్తే కోపంగా ఇంటిమీదకు వచ్చిన వాడిని కూడా 'అన్నయ్యగారూ! ఈ గొడవలన్నీ ఎప్పుడూ ఉండేవే! ఇదిగో ఈ కాఫీ తీసుకోండి. వదినగారు, పిల్లలు బాగున్నారా?' అని ఆ ఇంటి గృహలక్ష్మి నాలుగు అనునయ మాటలు మాట్లాడేసరికి అంతటి ప్రళయం కూడా అంతం అయిపోతుంది.

**పద్మాలంకృత్య పాణి పల్లవ యుగాం పద్మాసనస్థాం** - అమ్మ తన రెండు నునులేత చేతులలో పద్మలను పట్టుకొని ఉంటుంది. అలాగే ఆవిడ ఆసనం కూడా పద్మమే. అసలు దేవతలందరూ పద్మంలో కూర్చోవటమో, లేదా వారి ముఖాలను, నేత్రాలను, చేతులను, పాదాలను ఇలా ప్రతి అవయవాన్ని పద్మంతో పోల్చటం ఎందుకంటే అందులో ఏదో ఒక ముద్రమీద మన మనస్సు తుమ్మెదలా అతుక్కుపోవాలని.

**శ్రియం** - సరే, ఇక శ్రీ అంటే లక్ష్మీదేవే కదా!

**వాత్సల్యాది గుణోజ్వలాం** - అమ్మకు ఈ సృష్టిలోని ప్రతి జీవిపైన ఎంతటి వాత్సల్యమో! శక్తిస్వరూపిణియైన పార్వతీదేవి అనేక రూపాలలో ఎందరో రాక్షసులను సంహరించిన కథనాలు మనం ఎన్నో వింటూ ఉంటాం, కానీ లక్ష్మీదేవి ఎవరిమీదా ఆగ్రహం చూపించిన సందర్భం మనకు కనబడదు. లక్ష్మీ అష్టకంలో చాలామంది **'డోలాసుర భయంకరి'** అని చదువుతారు కానీ నిజానికి డోలాసురుడు అనే రాక్షసుడు ఎవరూ లేరు. అది **'కోలాసుర భయంకరి'**. కోల అంటే వరాహం. అడవిపంది రూపంలో ఉన్న ఆ రాక్షసుడు లోకాలను పీడిస్తుంటే, స్త్రీ చేతిలోనే

సంహరింపబడాలని వాడికి ఉన్న వరం కారణంగా తప్పనిసరి పరిస్థితులలో మహాలక్ష్మి అమ్మ వాడి అశాశ్వతమైన దేహాన్ని సంహరించినా మళ్ళీ తన వాత్సల్యంతో ఆ బిడ్డ పేరును శాశ్వతం చేస్తూ ఆ ప్రదేశాన్ని కొల్హాపురంగా మార్చి తాను శాశ్వతంగా అక్కడ కొలువై వుండిపోయింది.

**భగవతీం** - అమ్మ స్వయంప్రకాశ స్వరూపిణి. మనం త్రిమూర్తుల గురించి గొప్పగా చెప్పుకొని ముగ్గురమ్మలు ఏదో వారి భార్యలు అని తేలిగ్గా అనుకుంటాం కానీ ఆ త్రిమూర్తులకు శక్తినిచ్చేది, వారి వారి విధులను నిర్వర్తింపజేసేది ఆ తల్లులే. అటువంటి జగన్మాతయైన మహాలక్ష్మి తల్లికి నమస్కారం - **వన్దే జగన్మాతరం.**

సాధారణంగా ఎవరైనా స్త్రీ సంప్రదాయకమైన వేషభాషలలో కనిపిస్తే ఆవిడ ముఖంలో లక్ష్మీకళ ఉట్టిపడుతోంది అంటాం. ఉట్టిపడటం అంటే పొయ్యిమీద పెట్టిన పాలు పాత్రలోనుంచి కొద్దిగా బయటకు పొంగటంలాంటిది. అలాగే మానవుడు కూడా తనకున్న సంపదనంతా పంచిపెట్టేయడు. తన పాత్ర నిండిన తరువాత, లోపల ఇంకేదో చేయాలనే వేడిపుడితే, ఆ సంపదలో కొంత దానధర్మాల రూపంలో బయటకు పొంగుతుంది అంతే. కానీ జగన్మాత అలా కాదు. ఆవిడ '**వక్త్ర లక్ష్మీ పరీవాహ చలన్మీనాభ లోచన**' - అమ్మ ముఖంలో లక్ష్మి ప్రవహిస్తూ వుంటుంది. అంటే అక్కడ వచ్చినది వచ్చినట్లుగా ఇచ్చివెయ్యటమే కానీ దాచుకోవటం ఉండదు. అమ్మ వదనంలోని ఆ లక్ష్మీ ప్రవాహంలో రెండు చేపలు అటూ ఇటూ కదులుతూ ఉంటాయిట. ఆ చేపలే అమ్మ కళ్ళు. ఎప్పుడు ఏ బిడ్డకు ఈ సంపద అవసరమౌతుందో, ఆ క్షణంలోనే ఆదుకుందామని అమ్మ ఎప్పుడూ అటూ ఇటూ చూస్తూనే ఉంటుంది. మామూలుగా ఏదైనా ఆలయానికి ఒక గోపురం ఉంటుంది. గోపురం అంటే ఆలయానికి ప్రవేశద్వారం కదా. బయట అహంకారంతో విర్రవీగే జీవులందరూ ఈ ఎత్తైన గోపురం క్రిందకు వచ్చేసరికి తాము ఎంతటి అల్పులో అర్థమైపోయి శిరస్సు దానంతటదే భగవంతుని ముందు వంగిపోతుంది. అయితే మధురైలోని మీనాక్షీ అమ్మ ఆలయానికి ఒకటి, రెండు కాదు, ఏకంగా పధ్నాలుగు గోపురాలు ఉన్నాయి. అంటే తన చేపలవంటి కళ్ళతో ఎప్పుడు ఏ బిడ్డ తన దగ్గరకు వస్తాడో అని ఆ అమ్మ

నిరంతరం అటూ ఇటూ చూస్తూ ఏకంగా తనను చేరుకోవటానికి అన్నివైపులా పద్మాలుగు ద్వారాలు పెట్టుకుంది.

ఇక ముగ్గురమ్మల దగ్గరకు వస్తే విద్యకు, జ్ఞానానికి అధినేత్రి అయిన సరస్వతీదేవి సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడికి సేవ చేస్తున్నట్లు ఎక్కడా మనం చూడం. అంటే ఈ సృష్టికి పూర్వం నుంచి, సృష్టి ఉన్నా, లేకపోయినా ఎప్పుడూ శాశ్వతంగా ఉండేది జ్ఞానమే కానీ, అది సృష్టికి లోబడి వచ్చిపోయేది కాదు. అలాగే శక్తిస్వరూపిణి అయిన పార్వతీదేవి కూడా లయకారకుడైన పరమేశ్వరుని ప్రక్కన కూర్చున్నట్లుగానో, లేక ఆయనతో కలిసి నృత్యం చేస్తున్నట్లుగానో కనిపిస్తుంది కానీ, ఆయనను పూజిస్తున్నట్లు చాలా అరుదుగా కనిపిస్తుంది. అంటే సృష్టి అంతా లయించిపోయినా కానీ శక్తికి నాశనం లేదు. అంతెందుకు మన కళ్ళముందే ఎందరో కవులు, రచయితలు, గాయకులు, శాస్త్రవేత్తలు ఇలా ఎంతో ప్రతిభ కలవారు కాలగర్భంలో కలిసిపోతున్నారు కానీ, అంతటితో ఆయా కళలు కానీ, శాస్త్రాలు కానీ నశించిపోతున్నాయా? ఆ ప్రతిభ, లేక శక్తిని పుణికిపుచ్చుకొని దానిని ముందుకు తీసుకెళ్ళడానికి మరొక వ్యక్తి తయారవుతాడు. కానీ సంపదకు అధినేత్రి అయిన లక్ష్మీదేవి మాత్రం ఎప్పుడు సృష్టిని నడిపించే నారాయణమూర్తితో కలిసి కనిపించినా ఆయనకు పాదసేవ చేస్తూనే కనిపిస్తుంది. అంటే సృష్టి, లేదా ఒకవ్యక్తి జీవితం నడవటానికి సంపద కావాలి కానీ, సంపద కోసమే జీవితం కాకూడదు అనే సందేశాన్ని అమ్మ మనకు అందిస్తోంది.

మనందరం ఎంతగా నారాయణ స్మరణ చేసుకుంటే అంతగా లక్ష్మీ అనుగ్రహం కలుగుతుంది.



# నూతన సంవత్సరానికి స్వాగతం

-సుషుమ్నా ప్రసాద

ఆంగ్లకాలమాన ప్రకారము మనం క్రీ.శ 2023లో ప్రవేశించబోతున్నాం. లోకోద్ధరణకై ప్రభవించిన ఏసుక్రీస్తు జన్మ నుండి కాలాన్ని పరిగణిస్తే మనం 2023లో ప్రవేశిస్తున్నాం. వాస్తవంగా కాలం అనంతమైనది. దానికి ఆద్యంతాలు లేవు. అందుకే శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో తాను కాలస్వరూపుణ్ణి అని చెప్పకున్నారు. ఆంగ్లకాలమానం ప్రకారం విశ్వవ్యాప్తంగా వేడుకలు జరుపుకుంటారు. నూతనత్వాన్ని కోరుకోవడం అనేది మానవనైజం.

బాబూజీ మహరాజ్‌వారు మనం కోరుకోవలసినది నిత్య నూతనత్వమని ప్రబోధించేవారు. నిత్యమై, సత్యమైన దానికి మార్పు వుండదు. లేకపోతే కొత్త పాతలనేవి ఒక నాణెములోని బొమ్మ బొరుసులాంటివి. ఒకదాని తరువాత ఒకటి వస్తుంది. ఇందులో ఏదీ శాశ్వతము కాదు. మానవుడు ద్వంద్వాతీత స్థితికి ఎదిగినప్పడే నిజమైన నూతన సంవత్సరం జరుపుకోగలమని ప్రబోధించేవారు.

ఆధ్యాత్మిక సాధకుడు మనలో వున్న అవాంఛనీయమైనవి రహితం చేసుకుని, మానవ అభ్యుదయానికి సహకరించేవాక్కును, క్రియలను పెంపొందించుకోవాలి. సంఘసేవచేసి, విశ్వమానవ ప్రగతిని వాంఛించినప్పడే నిజమైన నూతనత్వమవుతుంది. 'ఆధ్యాత్మిక సాధకుడు భక్తి, జ్ఞాన, వైరాగ్యములతో వర్ధిల్లి త్రికరణ శుద్ధిగా విశ్వమానవ  శాంతిని వాంఛిస్తూ, సంఘసేవ, గురుసేవ చేశాడంటే, వాడు నూతనత్వానికి ప్రతీకగా వెలుగొందుతాడు.

స్వార్థ క్రియాకలాపాలతో కూడిన పాత సంవత్సరానికి స్వస్తి చెప్పి సర్వమానవ ప్రగతిని ఆహ్వానించే శుభ సంకల్పాలతో వర్ధిల్లటానికి కృషి చేస్తే మనం నిత్యమై, సత్యమైన నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతాం. పూజ్య మాతాజీ మనకు 2023 సంవత్సరానికి వారు తమ శుభాశీశ్శులను అందజేస్తున్నారు.  అందుక తగిన పాత్రలుగా అవడానికి మనం కృషి చేద్దాం.


దృష్టి
ముకుంద్
ధర్మరాజా! ఒక సారి వెళ్ళి ఊరిలో ఉన్న చెడ్డ వాళ్ళను తీసుకురా.
ఇటువంటి మనుషులకంటే కుడా నేనే చెడ్డ వాడిని కదా!


నీదే తప్పు....
కాదు నీదే....
ఇటువంటి మనుషులకంటే కుడా నేనే పెద్ద వాడిని కదా!
3
నా కంటే ఈ ఊరిలో పెద్దవారెవరూ లేరు స్వామీ! అందరూ మంచివాళ్ళే.
4


దుర్యోధనా! వెళ్ళి
ఈ ఊరిలో ఉన్న
మంచివారిని
తీసుకురా!


వీరందరికంటే
నేనే
మంచివాడిని
కదా!


నాకంటే ఈ ఊరిలో
మంచివారెవరూ లేరు కృష్ణా!
అందరూ చెడ్డవాళ్లే.
7


చూశారా పిల్లలూ!
అంతా మీదృష్టిని
బట్టే ఉంటుంది.
మీరు
మంచిదృష్టితో
చూస్తే
మనుషులందరి
లో మంచే
కనిపిస్తుంది. కానీ
మీరు చెడు దృష్టి
పెట్టి చూస్తే
అందరిలోనూ
చెడే కనిపిస్తుంది.
8

## రామానందావధూత

సేకరణ - మురళీ

1837వ సం. మే 1వ తేదీన తమిళనాడు చెన్నై పట్నం సమీనగల కలకటేరు అనే గ్రామంలో రామయ్య జన్మించారు. ఆయన తండ్రి బండారం వెంకట గోవిందయ్య, తల్లి బాలనాగమ్మ. అయిదుగురు అన్నదమ్ములలో రామయ్య రెండవవాడు. ఆ గ్రామంలో పాఠశాల లేనందున ఎవరికీ చదువులేదు. అన్నదమ్ములు అందరూ తండ్రికి వ్యవసాయంలో సహాయం చేస్తూ వుండేవారు. రామయ్య ఎక్కువగా పశువుల సంరక్షణ చూస్తూవుండేవాడు. చిన్నప్పటి నుండి రామయ్య ప్రవర్తన విలక్షణంగా వుండేది. కాలక్రమేణ రామయ్య భక్తిమార్గంలో పడి పశువులను ఒక్కొక్కరోజు తోలుకు వెళ్ళకుండా భజనలకు, వేదాంత చర్చలు జరిగే ప్రదేశాలకు వెళ్తుండేవాడు. అన్నగారైన గోపాలయ్య రామయ్య చర్యలు నచ్చక రెండు మూడుసార్లు గట్టిగా మందలించాడు. రామయ్య సంసార బంధాలు త్రెంచుకుని భార్యను, కుమారుని, అన్నదమ్ములను, తల్లిదండ్రులను వదిలి అడవిలోకి వెళ్ళిపోయాడు.

కొంతదూరం వెళ్ళేసరికి రామయ్యకు ఒక రామాలయం కనిపించింది. నిద్రాహారాలు లేకుండా నాలుగు రోజులు సాధన చేస్తూ అక్కడే వుండిపోయాడు. తరువాత అక్కడికి 20 మైళ్ళ దూరానగల మహిమాన్వితమైన సుబ్రహ్మణ్య క్షేత్రం తిరుత్తణి చేరుకున్నారు. తిరుత్తణిలో వున్న ఇతర సాధువులతో కలిసి సుబ్రహ్మణ్య స్వామిని సేవిస్తూ భజనలు చేస్తూండేవాడు. అక్కడ ఏర్పేడు స్వామిగా ప్రసిద్ధి చెందిన సుబ్బదాసుతో పరిచయం అయింది. సుబ్బదాసు విరాగి, జ్ఞాని, పండితుడు. సుబ్బదాసుకు శుశ్రూష చేస్తూ రామాయణ, భారత, భాగవతాలు, భగవద్గీత, ఇతిహాస పురాణాలు, ఆధ్యాత్మిక విషయాలు నేర్చుకున్నారు. వీరందరూ కలిసి పుణ్యక్షేత్రాలు దర్శిస్తూ, భక్తి ప్రచారం చేస్తూ దేశసంచారం చేస్తూ ఏర్పేడు చేరుకున్నారు. ఏర్పేడు గ్రామం బయట వున్న చెరువుగట్టునే వుంటూ సాధన చేసుకునేవారు. వీరిలో ఒకరిద్దరు మాత్రం గ్రామంలోకి వెళ్ళి భిక్ష తీసుకువస్తే అందరూ అదే సరిపెట్టుకునేవారు. రామయ్య ఆకులు, దుంపలు, కాయలు మాత్రమే తింటూ కఠోరమైన తపస్సు చేశారు. కొంతకాలం తరువాత వీరందరూ తిరువణ్ణామలై చేరుకుని శ్రీ రమణులను దర్శించుకున్నారు. శ్రీ రమణులకు రామయ్యపై అనుగ్రహం కలిగి 'రామానంద స్వామి' అనే

నామం ఇచ్చి ఆశీర్వదించారు. కొన్ని రోజులు రమణాశ్రమంలో వుండి తరువాత తిరుమల చేరుకున్నారు.

తిరుమలలో తమకు తపస్సుకు అనుకూలంగా వుండే ప్రదేశం కొరకు వెదికి గోగర్భం అనే నిర్జనమైన ప్రదేశాన్ని ఎన్నుకున్నారు. అక్కడ వీరికి శ్రీ సిద్ధారూఢ స్వామి (హుబ్లీ) దర్శనం అయింది. వీరు సిద్ధ పురుషులు. కొంతకాలం తరువాత రామానందులు (రామయ్య) తప్ప మిగిలినవారు వేరే చోటికి వెళ్ళిపోయారు. రామానందులు శ్రీ సిద్ధారూఢ స్వామిని సేవిస్తూ వారివద్ద అనేక యోగ ప్రక్రియలు, రహస్యాలు చేర్చుకున్నారు. శ్రీ సిద్ధారూఢ స్వామి రామానందుల సాధనకు మెచ్చి అనేక యోగ ప్రక్రియలు నేర్పారు. మంత్రోపదేశం చేసి, రెండు మండలాలు సాధన చేయించారు. గురుశిష్యులు ఇద్దరూ గోగర్భం విడిచి ఏర్పేడు చేరుకున్నారు. అక్కడ కొలను వద్ద వున్న జమ్మి చెట్టు దగ్గర కుటీరం నిర్మించుకుని సుమారు నాలుగు సంవత్సరాలు సాధన చేశారు. రామానందులు గురువులు పెట్టిన పరీక్షలకు తట్టుకుని గురువుగారి సంపూర్ణ అనుగ్రహానికి పాత్రులైనారు. శ్రీ సిద్ధారూఢులు రామానందులకు దివ్యదృష్టిని అనుగ్రహించి, 'గోగర్భం రామానందావధూత' అనే నామం యిచ్చి తాము తమ స్వస్థలానికి చేరుకున్నారు.

శ్రీ రామానంద స్వామి భక్తి ప్రచారం చేస్తూ దేశ సంచారంలో అనేక ప్రదేశాలకు వెళ్ళారు. ఎక్కిడికి వెళ్ళినా వందలకొలది భక్తులు స్వామిని ఆశ్రయించేవారు. స్వామి తపస్సు చేసుకుంటూ తీరిక సమయాలలో భక్తులకు భక్తి జ్ఞాన వైరాగ్యాలను బోధించేవారు. భగవద్గీతను వ్యాఖ్యానంతో భక్తులకు వివరించేవారు. అజ్ఞానులను జ్ఞానులుగానూ, దరిద్రులను ధనవంతులుగానూ, నిస్సంతులను సంతానవంతులుగానూ, రోగపీడితులను ఆరోగ్యవంతులుగానూ చేశారు. వీరి ప్రచార సమయంలో తెన్నా, హృషీకేశ్, బృందావనం, తుని, పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం, చేబ్రోలు, కొవ్వలి దర్శించారు. గుంటూరు పట్టణం, చేబ్రోలు, దాసరిపాలెం, లంకపల్లి, కస్తాను పాలెం, తెనాలి తాలూకా పెరవలి గ్రామంలో తమ ఆశ్రమ శాఖలు ఏర్పాటు చేసి ఎంతోమంది భక్తులను ఉద్ధరించారు. తమ 135వ ఏట పెదపూడిలో అశ్వత్థ వృక్షం క్రింద 1972వ సం. మే 1వ తేదీన సజీవ సమాధి చెందారు.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**జనవరి 2023**

1 ఆది - ఆంగ్ల సంవత్సరాది - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

2 సోమ - ముక్కోటి ఏకాదశి - ఉత్తరద్వార దర్శనం, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

6 శుక్ర - పుష్య పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ

12 గురు - శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన

14 శని - భోగి పండుగ, ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన. శ్రీ గురుదేవులకు భోగిపళ్ళు పోయుట

15 ఆది - సంక్రాంతి పండుగ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

16 సోమ - కనుమ పండుగ

17 మంగళ - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

20 శుక్ర - మాసశివరాత్రి

21 శని - అమావాస్య

26 గురు - వసంత పంచమి, శ్రీ సరస్వతీ పూజ, గణతంత్ర దినోత్సవం

28 శని - రథసప్తమి

**ఫిబ్రవరి 2023**

1బుధ - భీష్మ ఏకాదశి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

5 ఆది - మాఘ (గురు) పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన

15 బుధ - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

18 శని - మహాశివరాత్రి, శనిత్రయోదశి - తె.జా.3:30 గం. లకు శ్రీ గురుదేవులకు బృందావనంలో నమక చమక సహిత రుద్రాభిషేకము. ఉ.5:30 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ. ఉ.8:00 గం.లకు శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సామూహిక ఏకాదశ రుద్రాభిషేకములు. మ.12:00 గం.లకు సహస్ర ఘటాభిషేకము, లక్ష బిల్వార్చన, భక్త సమారాధన. రా.7:00 గం.లకు శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి వారి సామూహిక లీలా కళ్యాణ మహోత్సవం, అనంతరం నగరోత్సవం

20 సోమ - అమావాస్య

23 గురు - శ్రీ లలితానంద సరస్వతీ స్వామిని వారి ఆరాధన - సత్సంగం

# వివేక చూడామణి

(గత సంచిక తరువాయి) సేకరణ - రమణ ప్రసాద్

**బ్రహ్మ భావన (252-264)**

ఆ బ్రహ్మము జాతి నీతి కుల గోత్రములకు దూరము, నామ రూప గుణ వర్జితము, దేశ కాల వస్తువులకు భిన్నము; శుద్ధము, చిద్ఘనము, అనాదియైనది; క్షుత్ పిపాస మున్నగు షడూర్ములు లేనిది; సత్తు, అసత్తులకు భిన్నమైదది; అస్తి, జాయతే వర్ధతే, పరిణమతే, అపక్షీయతే, నశ్యతే అను షడ్భావ వికారములు లేనిది; భేద రహితమైనది, పరిణామము లేనిది; కార్య కారణములకు భిన్నముగా ఉండునది; నిత్యము, అవ్యయము ఆనంద రూపమైనది; సత్తు అయినది, తనకంటె పరము లేనిది, ప్రత్యగ్రూపమైనది; ఏకరసము, సచ్చిదానంద స్వరూపము అగు బ్రహ్మ పదార్థము నీవే. "నేనే బ్రహ్మను" (**బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని**) అని నిరంతరము మనస్సులో భావింపుము.

**అధ్యాస నిరాసము**

**స్వాత్మన్యేవ సదా స్థిత్వా మనో నశ్యతి యోగినః**
**వాసనానాం క్షయాశ్చాతః స్వాధ్యాసాపనయం కురు ॥** 278

చిత్తవృత్తుల నిరోధించి నిరంతరము ఆత్మ స్వరూపమునందే స్థితుడైనవానిలో మనస్సు నశించును. వాసనలు క్షీణించును. నీవును ఆ విధమున వాసనలను నివృత్తి చేసికొని అనాత్మయందు ఆత్మ రూపాధ్యాసమును విడువుము.

**తమో ద్వాభ్యాం రజస్సత్త్వాత్సత్త్వం శుద్ధేన నశ్యతి ।**
**తస్మాతసత్త్వమవష్టభ్య స్వాధ్యాసాపనయం కురు ॥** 279

రజ స్సత్త్వ గుణముల చేత తమో గుణము నశించును. సత్వ గుణము వలన రజోగుణము నశించును. రజస్తమోగుణ శూన్యమగు సత్వగుణముచే మిశ్రమ సత్వ గుణము నశించి కేవల సత్వ గుణము నిలచును. కావున శుద్ధ సత్వ గుణమును ఆశ్రయించి అహం మమ అధ్యాసమును విడువుము.

**ప్రారబ్ధం పుష్యతి వపురితి నిశ్చిత్య నిశ్చలః ।**
**ధైర్యమాలంబ్య యత్నేన స్వాధ్యాసాపనయం కురు ॥** 280

శరీర పోషణము ప్రారబ్ధానుసారముగ జరుగునని నిశ్చయించుకొని నిశ్చల చిత్తుడవై స్వ ప్రయత్నముగా అధ్యాసమును విడువుము.

**నాహం జీవః పరంబ్రహ్మేత్యతద్వ్యావృత్తి పూర్వకమ్ ।**

**వాసనా వేగతః ప్రాప్తస్వాధ్యాసాపనయం కురు ॥** 281
నేను జీవుడను కాను. పరబ్రహ్మను. అని నీలో జీవభావమును తొలగించుకొనుచు, వాసనాత్రయము వలన ప్రాప్తమైన అధ్యాసమును వీడుము.

**శ్రుత్వా యుక్త్యా స్వానుభూత్యాజ్ఞాత్వా సార్వాత్మ్యమాత్మనః।**
**క్వచిదాభాసతః ప్రాప్తస్వాధ్యాసాపనయం కురు ॥** 282
శ్రుతి చేతను, యుక్తి చేతను, స్వానుభవము చేతను ఆత్మ యొక్క సర్వాత్మకత్వమును గుర్తించి భ్రాంతి వశమున ప్రాప్తమైన అధ్యాసమును వీడుము.

**అనాదానవిసర్గాభ్యామీషన్నాస్తి క్రియామునే।**
**తదేక నిష్ఠయా నిత్యం స్వాధ్యాసాపనయం కురు ॥** 283
బోధవంతుడైన మునికి గ్రాహ్య త్యాగములు లేనందువలన కర్తవ్యము ఏదియు ఉండదు. కావున ఆత్మ నిష్ఠ వహించి ఆత్మయందు కలిగిన అధ్యాసమును త్యజింపుము.

**ప్రమాద నింద**

కర్మ బంధములు ఇంకను ఉండిన ఈ కానవచ్చు దృశ్యములను లయింప జేసుకొనుచు జాగరూకుడవై "నేను సత్తా మాత్రమగు ఆనంద స్వరూపుడను" అని చింతనము చేయుచు కాలము గడుపుము. జ్ఞానియైనవాడు స్వవరూపానంద సంధానము చేయుచు ఉండవలెను. ఉదాహరణములు : 1.కులట అయిన స్త్రీ ఎటుల పురుషుని బుద్ధిని భ్రష్టము చేసి పిచ్చివానిని చేయునో, అటులే విషయముల యందు ప్రవర్తిల్లుచున్న విద్వాంసుని ఆత్మ విస్మృతి భ్రష్టుని చేయును. కావున జాగరూకత వహించుము; 2.నీటిలోని నాచును ఇటునటు తొలగజేసినను నాచు నీటిని క్రమ్మివేయుము. అటులే ఆత్మ విచారణ చేయని పండితునికూడ మాయ క్రమ్మివేయును; 3.అజాగరూత కారణముగా ఎటుల కందుకము(బంతి) పట్టు తప్పి మెట్లమీద నుంచి పడునో, అట్లే తన లక్ష్యమైన బ్రహ్మయందు ఏ కొంచెము బహిర్ముఖ మైనను పతనము తప్పదు. (326) కాబట్టి వివేకవంతుడు, బ్రహ్మ వేత్త అయినవాడు సమాధి యందు ప్రమత్తుడగుటకు మించిన మృత్యువు వేరొకటి లేదు. కావున జాగరూకత వహించి చిత్తమును సమాహితము (స్థిరము) చేసికొనుము. (321-329)

- సశేషం

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

## ఆనందంతో ఉప్పొంగిన మిథిలానగరం

రాముడు తమ కులగురువులు మెచ్చ కౌశికమునియొక్క ఆనతి మేరకు, ఆతని మోమునొకమారు జూడ, ఆతడు కూడా అటులనే అన్నట్లు కనుసైగ చేసారు. దానినే గురువాజ్ఞగా భావించి, రాముడు ఆ శివధనుస్సుకు వందనమొసగి, దానిని బహు లాఘవముగ చేతితో ఎత్తి పట్టుకుని, నారిని సంధించాడు. గొప్ప గొప్ప రాజులు, మునులు అమరియున్న ఆ యాగశాలలో రాముని ధీరత్వం ఎలా ప్రదర్శింపబడిందో అన్నది వాల్మీకి ఈ విధంగా వివరించారు.

**ఆరోపయత్ స ధర్మాత్మా స లీలం ఇవతత్ ధనుః।**
**ఆరోపయిత్వా మౌర్వీం చపూరయామాస వీర్యవాన్।**
**తత్ బభంజ ధనుర్ మధ్యే నరశ్రేష్ఠోమహాయశాః॥**

(నరులందరిలో శ్రేష్టుడైన రాముడు, మంజూష (ధనుస్సు ఉంచబడిన పెట్టె)ను తెరచి, అందుంచబడిన శివధనుస్సును బహు లాఘవముగా ఎత్తి పట్టుకుని, నారిని కట్టే నిమిత్తమై ధనుస్సును వంచుచున్న సమయమందే అది పెద్ద పిడుగు పడిన శబ్దమొనరించి విరిగి పోయింది)

రాముడు ఆ ధనుస్సుని ఎంతోతేలికగా, కష్టం లేకుండా పైకి ఎత్తి, నారి కడదామని లాగేసరికి, వంగిన ఆ ధనుస్సు మధ్యలో "ఫడేల్" అని గట్టి శబ్దంతో విరిగిపోయింది. మొదట రాముడు సునాయాసంగా విల్లు తన చేతితో ఎత్తుటను, అంత సులభంగానే వింటి నారిని సంధించబోవుటను కనురెప్పలను వ్రాల్చడం సహితం మరచిపోయి యాగశాలయందు అమరియున్న అన్యదేశ రాజులు, మునులంతా వీక్షించసాగారు. పిడుగులు పడే శబ్దంతో ఆ శివధనుస్సు విరిగేసరికి రాముడు, లక్ష్మణుడు, విశ్వామిత్రుడు, జనకుడు తప్ప మిగిలిన వారందరూ మూర్ఛపోయారు.

**భగవన్ దృష్ట వీర్యో మే రామో దశరథాత్మజః।**

**అతి అద్భుతం అచింత్యం చ అతర్కితం ఇదం మయా ॥**

దశరథుని తనయుడు, సాక్షాత్తు భగవానుడు అయిన రాముడు శివధనుర్భంగం చేసి సీతను వీర్యశుల్కగా గెలుచుకున్నాడు. ఆయన ఇలా క్షణికంలో శివధనుస్సును విరిచివేయుట ఎంత అద్భుతంగా ఉన్నది!? ఈ ఘటన అద్భుతం (వర్ణింపనలవికాని), అచింత్యం (చింతించుటకు వీలుకానిది), అతర్కితం (వాదనజేయదగనిది).

అప్పుడు జనకుడు "మహానుభావా విశ్వామిత్రా! నీకు తెలుసు, అందుకే ఈపిల్లలిద్దరినీ ఇచ్చోటకు తీసుకొని వచ్చావు, రాముడు దశరథాత్మజుడు, ఈ సంఘటన అద్భుతం, ఊహించరానిది, ఎవరూ వాదించరానిది. సీతమ్మ మా వంశంలో జన్మించి, తగిన భర్తని పొంది మా వంశగౌరవాన్ని నిలబెట్టింది" అన్నాడు.

ఇదిలా జరుగుచుండ, సీత ముందురోజు సాయం సమయమున ఉద్యానవనము నుండి తాను చూసిన ఆ యువరాజు తప్పక శివధనుస్సును ఎక్కుపెట్ట వలయునన్న గంపెడాశ హృదయములో వరదలా పొంగుచుండ, 'ఏమో? ఏమగునో ఏమో!?' యను కలత మరొకవైపు పీడించుచుండ, అంతరంగ చెలికత్తెయైన నీలమాలను పిలిచి, యాగశాలకు వెళ్లి ఏం జరిగిందో చూసిరమ్మని పని పురమాయించింది. "నీవు శుభవార్తను తీసుకుని వస్తావన్న నమ్మకంతో నేను ఇచ్చోటనే వేచియుంటాను" అని చెప్పింది. "కలత చెందవలదు యువరాణీ!" యని బదులిచ్చిన నీలమాల సీతను కూర్చుండబెట్టి తాను యాగశాలకు బయలుదేరింది. అయినా ఆమె తిరిగి ఎప్పుడు వస్తుందా, ఏ విధమైన సమాచారమును తీసుకుని వస్తుందా అన్నభయం, ఆతురతలతో కూడిన సీతకు క్షణమొక యుగంగా గడిచింది. ఎట్టి నిరీక్షణకూ ముగింపు అన్నది ఒకటి ఉంటుంది కదా? నీలమాల తిరిగి రానే వచ్చింది. ఎలా వచ్చింది? అన్న విషయం కంబన్ రచన (తెలుగు అనువాదము) ద్వారా తెలుసుకుందాము:

- సశేషం

# కాళీబాబు సన్నిధిలో ఒక గంట

- వశిష్ఠ

'ఫ్రాన్సిస్ థామ్సన్' అను తెలుగు కవి 'పరమపదజాగిల' మనెడి తన సుప్రసిద్ధ కవితా రచనలో దేవునికీ మానవునికీ గల సంబంధం తండ్రీ కొడుకుల సంబంధమని ఒక చక్కని భావకల్పన చేశాడు. మానవుడు దేవుని నుండి తప్పించుకుని పారిపోతూ సృష్టిలోని రమణీయ వస్తుజాల మంతటి వెనుకా దాగుకోవాలని ప్రయత్నిస్తూ వుంటే, దేవుడు పరమపదపు జాగిలం మాదిరిగా తనకు చిక్కకుండా పారిపోయే కుమారుని తండ్రి వెంటాడినట్లుగా, తొందరపాటుగాని, కలవరపాటుగాని లేని దృఢసంకల్పపూర్వకమైన గమన వేగంతోనూ, హుందాతనంతో కూడిన పట్టుదలతోనూ వెంటాడుతున్నాడట.

ఇలా వెంటాడుతూ దేవుడు ఏమంటున్నాడంటే, "ఇదిగో, నన్ను వంచించిపోతున్న నిన్ను, సకల భూతములూ కూడా వంచిస్తాయి సుమా! నన్ను ఆశ్రయమివ్వనొల్లని నీకు ఎక్కడనూ ఆశ్రయం దొరకదు! నన్ను తృప్తునిజేయని నీకు దేనివలననూ తృప్తి చేకూరబోదు! నాకు చిక్కకుండా పలాయనమౌతున్నావు గనుక, సకల పస్తుజాలమూ అలాగే నీకు చిక్కకుండా పలాయనమౌతుంది!"

ఈ రూపకాలంకారమునే ఇంకా మనం కొనసాగిస్తూ ఈ రీతిగా చెప్పుకోవచ్చు - మానవుడీ విధంగా పరుగెత్తి పరుగెత్తి అలసిపోయి, తుదకు శ్రేయో మార్గం తనకు చూపగల సద్గురు సన్నిధి చేరుకుంటాడు. ఆ సద్గురువు భగవంతుని నుండి పలాయనం కావడం నిష్ప్రయోజనమని అతడు గుర్తించునట్లుగా చేసి, ఆ భగవదాశ్రయం అతనికి లభింపజేస్తాడు. అంతట భగవంతుడు కరుణా దృష్టితో అతనిని లాలిస్తూ, "నాయనా! నీనుండి నేను ఏమి లాగివేసుకున్నా నీకు హాని చేయడం కోసం కాదు. నన్ను అన్వేషించి నాలోనే అన్నీ నీవు పొందగలందులకై అలా చేశాను. పోయినట్లుగా నీవు పొరపాటున భావించిన వాటినన్నింటినీ ఇంటి వద్ద నీకొరకే నేను దాచి వుంచాను. లే, లేచి నాచేయి పట్టుకొని నాతో రా!" అని లేపి చేరదీసుకుంటారు.

సద్గురువు, నిర్వహించే పాత్ర యిదే- తండ్రిని విడనాడిపోయే కొడుకుకూ తండ్రికీ మధ్య - అనగా మానవునికీ భగవంతునికీ మధ్య

అనుసంధానం కూర్చడం. చీకటిలో మానవుడు తడుములాడు కుంటున్నప్పుడు గురుని అవసరం ఎంతగా ఉంటుందో రామకృష్ణ పరమహంస కంటే బాగా చెప్పగలవారు ఉండరు.

ఆయన ఇలా అన్నారు "గురువుని మనం కేవలం మానవ మాత్రునిగా తలపోయరాదు. శిష్యుడు భగవంతుని దర్శించే ముందు భగవంతుని దివ్య జ్యోతిని గురువులో దర్శిస్తాడు. పిమ్మట గురువే, భగవద్రూపంలోనికి తాను ఊహింపలేని విధంగా దివ్య పరివర్తనం చెందిన కారణాన, అతనికి భగవత్సాక్షాత్కారం కలుగజేస్తాడు. అప్పుడు శిష్యునికి భగవంతుడు, గురువు ఒకడేనని దర్శనమౌతుంది. శిష్యుడు ఏ వరం కోరినా, భగవద్రూపుడైన గురువు దానినతనికి అనుగ్రహించ గలుగుతాడు. అంతేకాదు అత్యున్నత పరమానందదాయి యగు నిర్వాణ స్థితిని కూడా చేకూర్చగలుగుతాడు. పెండ్లి మాటలు మాట్లాడి ప్రేయసి ప్రియులను కలిపే మధ్యవర్తి వలె, గురువు మానవునికి భగవంతునికీ అనుసంధానం చేకూర్చే మధ్యవర్తి."

అజ్ఞానమనే మహా సముద్రంలో చుక్కాని లేని నావవలె చిరకాలం కొట్టుమిట్టాడుతూ వుండినవారు ఎందరో, నంబూరు శ్రీకాళీగార్డెన్స్‌లోని శ్రీ హనుమత్ కాళీవరప్రసాద్ బాబు గారిని తమకూ జగత్పితయైన భగవంతునికి నడుమ అట్టి మధ్యవర్తిగా దర్శింప గలుగుతున్నారు. ఏండ్ల తరబడిగా వారు భగవంతునికి చాలా దూరదూరంగా పారిపోవ యత్నించినవారే. అట్టి వారినందరినీ శ్రీబాబుజీ దగ్గరకు తీసుకొని, లాలించి, అపారమైన ప్రేమను వర్షిస్తూ భగవత్సన్నిధికి చేర్చే మార్గంలోనికి ఒక్కొక్క అడుగే నడిపించుకొని పోతున్నారు. భక్తి తొణికిసలాడే మార్గమది. దీని ద్వారా ఆనందధామం లోనికి వీరిని గొనిపోవడమే బాబుగారి ఆశయం.

- సశేషం

# యచ్ఛదత్తనుడు

ఒకానొకప్పుడు చిదంబర క్షేత్రంలో 'యచ్ఛదత్తనుడు' అనబడే బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆయనకు 'విచారశర్మ' అనబడే కొడుకు వున్నాడు. ఆ కొడుకు వేదం నేర్చుకున్నాడు. ఆయన వేదమును చక్కగా సుస్వరంతో చదివేవాడు. ఎప్పుడూ స్వరం తప్పేవాడు కాదు. గోవులు, దేవతలని నమ్మిన పిల్లవాడు. ఒకరోజు ఒక ఆవులను కాసే ఆయన ఆవును కొడుతూ తీసుకువస్తున్నాడు. అది చూసిన ఆ పిల్లవాడి మనసు బాధపడి 'నేనే రేపటి నుండి ఈ ఆవులను కాస్తాను. నీవు ఈ ఆవులను కొట్టవద్దు. తీసుకుని వెళ్ళవద్దు' అని చెప్పాడు. బ్రాహ్మణుడు బ్రహ్మచారి, వేదం చదువుకున్నవాడు ఆవులను కాపాడితే మంచిదే కదా అని ఊళ్ళో ఉన్న వాళ్ళందరూ ఆవుల వెనకాల ఈ పిల్లవాడిని పంపించారు.

ఈ పిల్లవాడు వేదమంత్రములను చదువుకుంటూ వాటిని స్పృశించి వాటిని జాగ్రత్తగా కాపాడుతుండేవాడు. వేదంలో కొన్ని కొన్ని పన్నాలకు కొన్ని కొన్ని శక్తులు ఉంటాయి. ఆవుల్ని రక్షించడానికి ఆ పన్నాలను చదువుతూ వాటిని కాపాడేవాడు. ఆవులు సంతోషించి ఆ పిల్లవాడు కూర్చున్న చోటికి వచ్చి అతడు మంచినీళ్ళు తాగడానికి ఒక కుండ తెచ్చుకుంటే ఆ కుండలో పాలు విడిచి పెట్టేస్తుండేవి. రోజూ ఇచ్చే పాలకన్నా ఎక్కువ పాలను ఇంటి దగ్గర ఇచ్చేవి. ఈ పిల్లవాడు ఆవులు ఎలాగూ పాలువిడిచి పెడుతున్నాయి కదా వట్టినే కూర్చోవడం ఎందుకని ఈ ఆవులన్నింటిని విడిచిపెట్టి కట్టేవాడు. రుద్రం చదవడం కన్నా గొప్పది మరొకటి లేదు. అందుకే లోకమునందు సన్యసించినవారు కూడా రుద్రాధ్యాయం చదవాలని నియమం. రుద్రాధ్యాయం అంత గొప్పది. అది చదివితే పాపములు పటాపంచలు అయిపోతాయి. అటువంటి రుద్రం చదువుతూ ఇసుకతో శివలింగం తయారుచేసి ఈ పాలను తీసి రుద్రాధ్యాయంతో అభిషేకం చేస్తూ ఉండేవాడు.

ఒకరోజున అటునుంచి ఒక వెర్రివాడు వెళ్ళిపోతున్నాడు. 'అయ్యో, ఈ పిల్లవాడు ఈ పాలనన్నిటిని ఇసుకలో పోసేస్తున్నాడు. ఇంకా ఆవులు ఎన్ని పాలిచ్చునో' అని వెళ్ళి ఆ పిల్లవాడి తండ్రికి చెప్పాడు. చెప్తే

యచ్ఛదత్తనుడికి కోపం వచ్చింది. 'రేపు నేను చూస్తాను' అని చెప్పి మరుసటి రోజున కొడుకు కన్నా ముందే బయలుదేరి అడవిలోకి వచ్చి ఆవులు మేసేచోట చెట్టెక్కి కూర్చున్నాడు. పూర్వకాలం క్రూర మృగములు ఎక్కువ. అందుకని కర్ర గొడ్డలికూడా తనతో తెచ్చుకుని చెట్టెక్కి కూర్చున్నాడు. కాసేపయింది. కొడుకు ఆవులను తీసుకువచ్చి అక్కడ ఆవులను విడిచిపెట్టాడు. ఆవులు అక్కడ మేత మేస్తున్నాయి. ఈయన సైకత లింగమును తయారుచేసి సైకత ప్రాకారములతో శివాలయ నిర్మాణం చేశాడు. తరువాత చక్కగా ఈ ఆవులు తమంత తాముగా విడిచిపెట్టిన పాలతో రుద్రం చదువుతూ అభిషేకం చేసుకుంటున్నాడు. ఆయన మనస్సు ఈశ్వరుని యందు లయం అయిపోయింది. అతను పరవశించిపోతూ సైకత లింగమునకు అభిషేకం చేస్తున్నాడు. అవును అతడు చెప్పింది నిజమే. వీడు ఇసుకలో పాలు పోస్తున్నాడని దూరంగా చెట్టు మీద ఉన్న తండ్రి చెట్టు దిగి పరుగెత్తుకుంటూ వచ్చి పెద్ద పెద్ద కేకలు వేసి పిల్లాడిని భుజముల మీద కొట్టాడు. ఆ పిల్లవాడికి బాహ్యస్మృతి లేదు. అతని అభిషేకం చేస్తున్నాడు.

కోపం వచ్చిన తండ్రి తన కాలితో అక్కడి సైకత లింగమును తన్నాడు. ఎప్పుడైతే అది ఛిన్నాభిన్నమయిందో అప్పుడు ఆ పిల్లవాడికి బాహ్యస్మృతి వచ్చింది. తండ్రి వచ్చినప్పుడు గొడ్డలి అక్కడ పెట్టాడు. ఈ పిల్లవాడు వచ్చినవాడు తండ్రియా లేక మరొకడా అని చూడలేదు. ఏ పాదము శివలింగమును తన్నిందో ఆ పాదము ఉండడానికి వీలులేదని గొడ్డలి తీసి రెండు కాళ్ళు నరుక్కుపోయేటట్లు విసిరాడు. తండ్రి రెండు కాళ్ళు తొడలవరకు తెగిపోయాయి. క్రిందపడిపోయాడు. నెత్తుటి ధారలు కారిపోతున్నాయి. కొడుకు చూశాడు. 'శివలింగమును తన్నినందుకు నీవీ ఫలితం అనుభవించవలసిందే' అన్నాడు. నెత్తురు కారి తండ్రి మరణించాడు.

- సశేషం

# శ్రీ బాబు దివ్య లీలలు

భోగరాజు భారతీదేవి

1) శ్రీబాబు శ్రీశైలంలో భ్రమరాంబా దేవి గుడిలో శ్రీచక్రం వద్ద కుంకుమ పూజ చేస్తూ '**ఆత్మవిద్యాయై నమః**' (583వ నామం) అనే నామం చదువుతుంటే వారు కూడా గట్టిగా చదివి ప్రక్కనే వున్న విశ్వనాథం మామయ్య తొడపై బడెల్ మని చరిచారుట. ఆ దృశ్యం ఆ నామం చదువుతున్నప్పుడు ఇప్పటికీ గుర్తుకు వస్తోంది.

2) (పెద్దల ద్వారా) భక్త సోదరుల ద్వారా విన్న దివ్య వాక్కు : **ఓం క్లీం ఐం హ్రీం శ్రీం శ్రీమాత్రే నమః** 'క్లీం' అనే బీజాక్షరమును శ్రీబాబూజీయే చెప్పారుట.

3) భక్త సోదరి కావుపాడు బేబమ్మగారు, మా అక్క సుశీలతో చెప్పిన అనుభవం : శ్రీబాబూజీ మహరాజ్‌వారు స్వస్వరూపలయం పొందిన సంవత్సరంలో ఆమె ధ్యానంలో వుండగా ఆమెకు 'శ్రీబాబూజీ తెల్లటి విమానంలో వెళ్ళిపోతున్నట్లుగా' అనుభవం కలిగిందట.

4) 1960 జులై 14న శ్రీబాబు ముంజవరపుకొట్టులో చెప్పిన బోధ ఆ రోజు ప్రళయం వస్తుందని అందరూ చెప్పుకుంటున్నారని సాయంత్రం 7గం. నుండి 10గం.ల వరకు దివ్యమైన బోధను అందించారు. 'పరమేశ్వరుణ్ణి నమ్ముకున్నవాడు ప్రళయమైనా, ప్రణయమైనా చలించడు. అదే దైవబలం. దేశము, కాలము, సృష్టికర్త అన్నీ ఆ శక్తికి లోబడినవే' అని చెప్పారు.

5) 1967లో శ్రీబాబు దివ్యబోధను అందిస్తూ 'కట్టె, కొట్టె, తెచ్చె అనే మూడు మాటలలోనే సాధన సారాంశం అంతా ఇమిడి వుంది. మనసును కట్టి, అహంకారమును కొట్టి, ముక్తికాంతను తెచ్చి' భగవానుని మనం ప్రేమించడం చాలదు, ఆయన మనను ప్రేమించే విధంగా ఆచరించుకోవాలి. ఆయన ప్రేమను పొందిన జీవుడు ధన్యుడు.

6) భక్త సోదరి ఉంగుటూరు లక్ష్మిగారు మా అమ్మగారు తులసీదేవికి చెప్పిన విషయం : వారి బంధువు ఒకరు శ్రీబాబూజీకి సమర్పించమని 4 పెద్ద ఆపిల్ పండ్లు వీరికి ఇచ్చారుట. ఆమె తీసుకువెళ్ళి ఇస్తే, శ్రీబాబు 'నువ్వే తిను. ఒకే చెట్టు క్రింద కూర్చుని తిను' అని

ప్రసాదంగా ఇచ్చారుట. ఆమె మా అమ్మకు చెబితే 'ఒకేసారి తినలేక పోతే, రోజుకు ఒక పండు చొప్పున నాలుగురోజులు అదే చెట్టు క్రింద కూర్చుని తినమ్మా' అని మా అమ్మ చెప్పింది. తనొకసారి అలాగే గ్లాసు బత్తాయిపండు రసం తీసి శ్రీబాబుకు సమర్పిస్తే, 'నువ్వే త్రాగు' అన్నారుట. గురువాజ్ఞ కదా అని అలాగే చేసింది.

**అమ్మ చెప్పిన చిన్న కథ**

ఒక ఊరిలో ఒక పండితుడు వుండేవాడు. ఆయన చాలా గొప్ప భక్తుడు. రోజూ సత్సంగాలు జరుపుతూ వుండేవాడు. మృత్యుదేవత ఒకరోజు వారికి కనిపించి, 'నేను మీ ఊరు రావడానికి భయపడుతున్నాను. మీరు అనుమతి ఇస్తే రేపు మీ ఊరు వచ్చి ఒక నలుగురిని తీసుకుపోతాను' అన్నది. ఆయన 'సరే' అన్నాడు.

అంటే భగవంతుని నమ్ముకొన్న వారి జోలికి పోవడానికి మృత్యుదేవత కూడా భయపడుతుందన్నమాట. కానీ ఆ మరునాడు వార్తా పత్రికలో 100 మంది చనిపోయారు అని వార్త వచ్చింది. అప్పుడు ఆ పండితుడు అదేమిటి? అని మృత్యుదేవతను ప్రశ్నిస్తే, ఆమె 'కాలం తీరిపోయినవారు కేవలం నలుగురే. కానీ మిగిలిన 96మంది కూడా మృత్యు భయంతో చనిపోయిన వారే!' అని సమాధానం చెప్పింది.

దృఢమైన భక్తి విశ్వాసాలు వున్నవారికి ఏ భయమూ వుండదని అమ్మ తరచు చెబుతూ వుంటారు కదా!

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమవాసులు విస్సా వెంకటరెడ్డి నాయుడు (పాలకొల్లు నాయుడు) గారు 21-12-22 బుధవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 65 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

## భక్తి

సేకరణ - ఈవూరి కమలాలయ

పూర్వం బెజ్జ మహాదేవి అనే భక్తురాలు ఉండేది. ఆమె ఒకనాడు ఇలా అనుకుంది, 'శివునికి అందరూ ఉన్నారు, కానీ అమ్మా నాన్నా మాత్రం లేరు. చచ్చిపోయారో ఏమో పాపం, మా అమ్మ పోతే నాకెంత దుఃఖమో, ఆయనకూ అంత బాధే ఉండాలి కదా! తల్లి వుంటే శివుణ్ణి సన్యాసి కానివ్వదు, తల్లి వుంటే తల జడలు కట్టనివ్వదు, అమ్మ వుంటే విషం త్రాగనిస్తుందా! అలా తోలు కట్టుకొని తిరగనిస్తుందా, పాములు మెడలో వేసుకుని, వంటికి బూడిద పూసుకుని తిరుగుతుంటే చూస్తూ ఊరుకుంటుందా! తల్లి వుంటే శివునికి తిరిపమెత్తుకు తిరిగే కర్మమెందుకు పడుతుంది అనాథలా వల్లకాటిలో ఎందుకు తిరిగేవాడాయన'.

దానితో ఆమెకు శివుడి మీద మాతృత్వ భావన కలిగింది, 'అమ్మానాన్నలు లేని ఆ శివయ్యకి ఇక నుంచి అమ్మయినా, నాన్నయినా నేనే' అని అనుకుంది. బెజ్జమహాదేవి శివలింగ మూర్తిని కాళ్ళ మీద పడుకోబెట్టుకొని, నీళ్ళు పోసి తుడిచి వస్త్రాలు చుట్టి భస్మం పెట్టి, కాటుక బెట్టి పాలు తాగిస్తూ పెంచసాగింది, ఆమె ముగ్ధ భక్తికి శివుడు మెచ్చి అన్ని ఉపచారాలూ స్వీకరించసాగాడు. ఒకనాడు ఆమెను పరీక్షింపదలచి పాలు తాగడం మానివేశాడు. బెజ్జ మహాదేవి దానికి భయపడిపోయింది, 'అయ్యో! బిడ్డడికి అంగిట్ల ముల్లయింది' అని ఏడ్చింది.

'అడ్డమైన ప్రతి భక్తుడి ఇంటికి తిరిగి ఏది పెడితే అది తిని వస్తావు, ఎక్కడ గొంతునొచ్చిందో ఏమో'నని పుత్రవాత్సల్యం చూపిస్తూనే ఆయనకు కలిగిన కష్టానికి కుమిలిపోయింది. శివుడు పాలు, వెన్నా ఏమీ ముట్టకపోయేసరికల్లా 'ఇక మాటలతో పనిలేదు బిడ్డా! నీ బాధ చూస్తూ నేను బతికి ఉండి మాత్రం ఏమి లాభం' అని తల నరుక్కోడానికి సిద్ధపడింది. ఆమె అవ్యాజ ప్రేమానురాగాలకు, నిష్కల్మష భక్తికి ఉబ్బు శంకరుడు మరింతగా ఉబ్బిపోయాడు! వెంటనే ఆమె ముందు ప్రత్యక్షమై 'వరాలు కోరుకో'మన్నాడు, అప్పుడు బెజ్జ మహాదేవి "కన్న ప్రేమకంటే ఈ పెంచిన ప్రేమయే గొప్పది, నీవు నా కొడుకువు. నీ ముఖాన్నే శాశ్వతంగా చూస్తూ ఉండేటట్టు అనుగ్రహించు" అంది. శివుడందుకు సంతోషించి ఆమెకు నిత్యత్వాన్ని ప్రసాదించాడు. శివునికి తల్లి అయిన కారణంగా ఆమె అమ్మవ్వ అనే పేర ప్రసిద్ధురాలైంది. భగవంతుడిని అదివ్వు, ఇదివ్వు అని కోరుకునేవారే కానీ, ఆయనకు అమ్మానాన్నా అయి, ఆలనాపాలనా చూసేవారెవరుంటారు? భక్తి అంటే అలా ఉండాలి!

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ వీరయ్యచౌదరిగారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

శ్రీ వీరయ్య చౌదరిగారు రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులో సివిల్ ఇంజనీరుగా పని చేసి, పదవీ విరమణ అనంతరం విజయవాడలో ఉండేవారు. వారు, వారి కుటుంబము శ్రీ బాబు యెడల అపార భక్తి గలవారు. వీరయ్యగారు శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ నిర్మాణమునకు ప్లాను వెయ్యటం దగ్గర నుంచి, శ్రీ బాబు విజ్ఞాన మందిరము, భక్తుల గృహాలు నిర్మాణం చేసే పనులలో రాత్రి, పగలు అని లేకుండా, నిద్రాహారాలను కూడా లెక్క చేయకుండా సేవ చేసుకుని, ఆ సేవ తోనే తమ జన్మ సార్థకమైనట్లు భావించే వారు.



శ్రీ బాబు "నా నివాసానికి ఒక చుట్టు గుడిసె చాలునయ్యా!" అని చెబుతున్నా వినక "నా గురుదేవులు ఎటువంటి భవనంలో ఉంటే నాకు తృప్తిగాను, ఆనందంగాను ఉంటుందో అలా కట్టి తీరవలసిందే" అని, శ్రీ బాబుతో వాదించి అయినా సరే, ఆయన తమకు తృప్తిగా వుండే విధంగా శ్రీ బాబు విజ్ఞాన మందిరమును కట్టించారు.

ఆశ్రమ స్థాపనకు ముందే ఒకసారి వీరయ్య చౌదరిగారు శ్రీ బాబును, భక్తులందరిని కోటప్ప కొండ తీసుకొని వెళ్ళి, అక్కడ రెండు మూడు రోజులు భగవద్దర్శనముతో బాటు, సత్సంగ సమావేశములను నిర్వహించి శ్రీ బాబు దివ్య బోధలను అందరికీ అందజేయాలని సంకల్పించారు. ఆ రోజులలో కొండ పైన భక్తులందరికీ నీటి వసతి, నివాసానికి వసతి కూడా తక్కువగా ఉండేది. కొండ క్రింద నుంచి నీరు పైకి తెచ్చుకోవలసి వచ్చేది.

అందుకని శ్రీ బాబు వీరయ్య చౌదరిగారితో అన్ని విషయాలూ మాట్లాడి, యీ ప్రయత్నం నుండి విరమింప చేయాలని చూశారు. కాని వీరయ్య చౌదరిగారు "జీవితంలో ఒక్కసారైనా నా గురుదేవులకు,

నా భక్తసోదరులకు యిటువంటి సేవ చేసుకోవలెననే నా కోరికను మీరు మన్నించక తప్పదు” అని శ్రీ బాబును ఒప్పించి యాత్ర ఏర్పాటు చేశారు. ఎన్నో శ్రమలకోర్చి, వీరయ్యచౌదరిగారు ఆ పుణ్యక్షేత్రంలో, అన్ని యిబ్బందులను అధిగమించి, అన్ని వసతులూ కల్పించి, తమ గురుదేవులను భక్త సోదరీ సోదరులను తనివి తీరా సేవించుకొని మహదానందం పొందారు. శ్రీ వీరయ్య చౌదరిగారు శ్రీ బాబు అవతార పరిసమాప్తి అనంతరం కూడా, ఓపినంత వరకు ఆశ్రమ సేవ చేసుకొని, శ్రీ గురుస్మరణలోనే తమ జీవితమును చరితార్థం చేసుకొని శ్రీ సద్గురు లయం పొందారు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**జనవరి 2023**

1 ఆది - ఆంగ్ల సంవత్సరాది -సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ
2 సోమ - ముక్కోటి ఏకాదశి- సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ
6 శుక్ర - పుష్య పూర్ణిమ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ
14 శని - భోగి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట
15 శని - సంక్రాంతి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ
17 మంగళ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ
**25 బుధవారం నుండి 29 ఆదివారం వరకు వార్షిక సత్సంగములు**
26 గురు - శ్రీ సద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠా అష్టమ వార్షికోత్సవము (2015 మాఘశుద్ధ పంచమి) - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ
28 శని - రథసప్తమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

**ఫిబ్రవరి 2023**

1 బుధ - భీష్మ ఏకాదశి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ
5 ఆది - మాఘ (గురు) పూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ
15 బుధ - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ
18 శని - మహాశివరాత్రి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

## విస్మృ  కథలు

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

# సమర్థ రామదాసు

"అమ్మా! ఇంకముందు నారాయణతో వివాహ ప్రసక్తి ఎత్తకు. ఏకంగా వివాహం నిశ్చయించి వాడికి చెబుదాం. వివాహం నిశ్చయమైతే పరువు కోసమైనా వాడు పెళ్ళిపీటల మీద కూర్చుంటాడు" అన్నాడు శ్రేష్ఠుడు. నారాయణకు వివాహం నిశ్చయం అయింది. ఈ విషయం నారాయణకు తెలిసింది. తల్లిని గద్దించి అడిగాడు. "నాయనా! నిన్ను పెళ్ళి కొడుకుగా చూసే భాగ్యం ఈ దీనురాలికి లేదా?" అంటూ ఆవేదన పడింది. "సరే!" అన్నాడు నారాయణ. పెళ్ళి రోజున నారాయణ పెళ్ళి కొడుకుగా ముస్తాబయి "అమ్మా !నేను బాగున్నానా?" అన్నాడు. "సాక్షాత్తు శ్రీరామచంద్రుడిలాగ ఉన్నావు" అన్నది. "నన్ను ఇలా చూడాలి అన్న నీ కోరిక తీరిందా?" అన్నాడు నారాయణ. "చాలు నాయనా! ఈ జీవితానికి ఇది చాలు" అన్నది. "నారాయణా ముహూర్తం దగ్గర పడుతోంది. పద పీటల మీదికి" అని వంటిట్లోకి వెళ్ళింది తల్లి. వేదఘోషలతో పెళ్ళిపందిరి మారుమ్రోగుతోంది. బ్రాహ్మణుడు "సావధాన! సుముహూర్త సావధాన!" అని మంత్రం చదువుతున్నాడు. "అవును నేను సావధానంగానే ఉన్నాను వస్తున్నాను రామా!" అంటూ దొడ్డి గుమ్మం నుండి పలాయనం చిత్తగించాడు నారాయణ. తల్లి తనను పెళ్ళి బట్టలలో చూడాలని అనుకుంది, చూసింది. ఆమెకిచ్చిన మాట నిలబెట్టుకున్నాను" అనుకుంటూ గోదావరి నది దాటి పంచవటి చేరుకున్నాడు. అక్కడనుండి నాసిక్ వెళ్ళాడు.

చిన్న వయస్సు. ఎండావానలకు, చలికి తట్టుకొంటూ దృఢనిశ్చయంతో శ్రీరాముణ్ణి స్మరిస్తూ లక్ష్యసాధన కొరకు తపస్సు చేశాడు. టాకళికి వెళ్ళి గోదావరి నదీ సంగమంలో నడుం లోతులో "శ్రీరామ జయరామ జయజయ రామ" అనే త్రయోదశాక్షరిని జపించేవాడు. మధ్యాహ్నం దాకా జపం చేసుకొని మధుకరి తెచ్చుకుని రాముడికి నివేదన చేసి భుజించేవాడు. ఒకనాడు పులి నారాయణను అడ్డగించింది. "నీ నిజరూపం చూప"మని మ్రొక్కాడు. వెంటనే పులి రాముడిగా దర్శనం ఇచ్చింది. రాముడు "కృష్ణతీరాన ఉంటూ జగదోద్ధరణలో శివాజీకి తోడ్పడవలసింద"ని ఆదేశించాడు.

టాకళికి ఉత్తరాన రెండు మైళ్ళ దూరంలో "దశపంచక" అనే గ్రామంలో కులకర్ణి అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతనికి సంతానం లేదు. క్షయ వ్యాధితో అతడు మరణించాడు. తన భర్తతో సహగమనానికి సిద్ధపడింది ఆయన భార్య. అప్పుడు ఒక తేజస్వి అయిన తపస్వి అక్కడకు వచ్చాడు. చివరిసారిగా అతని పాదాలకు వందనం చేసింది. "అష్టపుత్ర, సౌభాగ్యవతీ భవ" అని దీవించాడు. ఆ తపస్వి ఎవరో కాదు, రామదాస్. అంత దు:ఖంలోను ఆమెకు నవ్వు వచ్చింది. "అదుగో స్వామీ! నా భర్త శవాన్ని తగలబెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నారు" అని భర్త పాడె వైపు చూపింది. "అమ్మా! ఇవి నేను ఇచ్చిన ఆశీస్సులు కావు. నా రాముడు ఇచ్చినవి. ఇవి ఎన్నటికీ వృధాపోవు" అంటూ కులకర్ణిగారి మృతదేహంపై తన చేతి కమండలంలోని నీరు రామనామం స్మరిస్తూ చిలకరించారు. అంతే! కులకర్ణి అప్పుడే నిద్రనుండి లేచిన వాడిలా మేల్కొన్నాడు. కులకర్ణి ఆయనకు మొక్కి "స్వామీ! మీరు అప్పుడే వచ్చేశారా?" అన్నాడు ఆశ్చర్యంగా. భార్యవైపు చూసి "నన్ను యమదూతలు యముడి వద్దకు తీసుకు వెళ్ళారు. యముడు నన్ను ఏదో అడగబోయే లోపల ఈ స్వామి అక్కడకు వచ్చారు. యముడు తన ఆసనం దిగి వచ్చి "ఏదైనా ఆజ్ఞ ఉన్నదా?" అని అడిగారు. "మీ దూతలు మా వాణ్ణి పట్టుకొచ్చారుట. మావాణ్ణి తక్షణం వదిలేయాలి" అన్నారు. యముడు వెంటనే నన్ను వదిలేయాలని ఆజ్ఞ జారీ చేసి "పుత్ర ప్రాప్తిరస్తు" అని దీవించాడు. "స్వామీ! మిమ్మల్ని రోజు మధుకరి అడిగే కుఱ్ఱాడని అనుకున్నాం కాని ఇంతటి సామర్థ్యం ఉన్నవారని అనుకోలేదు. మిమ్మల్ని 'సమర్థ రామదాస్' అని పిలుస్తాం" అని అందరూ జయజయ ధ్వనాలు చేస్తుండగా ఘోషణ చేశారు. కాలాంతరంలో వారికి మొదట పుత్రుడు కలిగాడు. ఆ పుత్రుణ్ణి రామదాస్ గారికి పాదార్పణం గావించారు. సమర్థులు "ఇతనికి 'ఉద్ధవ' అని పేరు పెట్టండి. కాస్త పెద్దవాడయ్యేదాకా మీ దగ్గరే ఉండనివ్వండి. సమయం వచ్చినప్పుడు నేను పిలుస్తాను" అన్నారు.

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## శ్రీ సద్గురు స్థాపిత ఆశ్రమ స్వర్ణోత్సవాల దృశ్యములు



స్వర్ణోత్సవము సందర్భముగా
కేక్ కట్ చేస్తున్న శ్రీ మాతాజి



రథోత్సవము



యాగము



పూర్ణాహుతి

REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on 5th and 6th of every month.

RNI No. : 37804/81
Postal Regd. No. : GTR/27/2021-2023

## శ్రీ సద్గురు స్థాపిత ఆశ్రమ స్వర్ణోత్సవాల దృశ్యములు



సాధు
మహాత్ములకు
స్వాగతము




సాధు
సమ్మేళనము



అన్నదానము

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508,
Guntur Dist., A.P.